


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 63 | బుధవారం 04 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3


## మూడు వారాల్లోగా ఇబ్రహింపట్నం మున్సిపల్ ఎన్నిక

### రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక పక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు.



# హోలీ ధూమ్‌ధామ్

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు

డీజే మోతలు, రెయిన్ డ్యాన్స్‌లతో వీధులన్నీ రంగుల మయం

తీన్‌మార్ స్టెపులతో యువతలో ఫుల్‌జోష్



## మోడీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ

# ఖమేనీ హత్యపై మౌనమెందుకు?



ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్చిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసపినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాం÷–రతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ.



### సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు

ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్

గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ

జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం

# చేతులెత్తేసిన ట్రంప్ ప్రభుత్వం



- ఇప్పుడు తరలించడం సాధ్యం కాదన్న ఎంబసీ
- షెల్టర్లలో తలదాచుకోవాలని తన పౌరులకు సూచన
- 'తాబా' సరిహద్దు దాటడానికి ఇజ్రాయెల్ షటిల్ సర్వీసులు
- ఇలా ప్రయాణించే వారి ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వలేమని హెచ్చరిక

## ఇజ్రాయెల్ లోని అమెరికన్లకు షాక్..!





## రాజ్యసభ స్థానాలు ఒకరికా? ఇద్దరికా?

రాజ్యసభ రేసులో నలుగురు బిసి నేతలు

ఆ ఇద్దరు ఎవ్వరో నేడు తెలుస్తుంది: పిసిసి చీఫ్

రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశాలు



## ఇంద్రకీలాద్రిపై 6నుంచి కుంభాభిషేకం

### సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ మహోత్సవానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆలయ అధికారులు ఆహ్వానం అందజేశారు. మంగళవారం దుర్గా దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్.. సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందజేశారు. అర్చకులు స్వామివార్ల చిత్రపటం, ప్రసాదం అందజేసి.. సీఎంకు ఆశీర్వచనాలు అందించారు. అలాగే విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే కుంభాభిషేక మహోత్సవానికి మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానం అందించారు అధికారులు. కుంభాభిషేకానికి రావాల్సిందిగా లోకేశ్‌కు

## స్త్రీశక్తి పథకంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

సిఎం చంద్రబాబుతో ప్రకాశం ఎస్పీ

రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలని అధికారులరు సిఎం సూచన

రోడ్డు ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. స్త్రీశక్తి పథకంతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సిఎం చంద్రబాబుతో అన్నారు. దీంతో ఈ రకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.



## జగన్‌తో టి-డిప్యూటీ సీఎం భట్టి భేటీ

మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం భేటీ అయ్యారు. అమరావతిలో ని జగన్ నివాసంలో భేటీ అయిన భట్టి.. ఈ నెల 5న హైదరాబాద్‌లో జరిగే తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరుకావాలని జగన్‌ను ఆహ్వానించారు. జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.



# సిఫారసులు అమలైతే చాలు కౌలు రైతు గట్టెక్కినట్టే!

రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర సహాయాచార్యులుగా పనిచేస్తున్న నేను ఇటీవల నా విద్యార్థులతో కలిసి ఒక ప్రాజెక్టు పనిలో భాగంగా, చేవెళ్ళకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవుని ఎర్రవల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయగా రాష్ట్రంలోని రైతులు, ప్రత్యేకించి కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గమనించాం. వారిలో భూమి కలిగిన రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన తరువాత చాలా రోజులకు (కొన్నిసార్లు మూడు నెలల తరువాత) డబ్బులు తమ ఖాతాలో పడుతున్నాయని, అంతేగాక ఒకవేళ రైతు పంట రుణం తీసుకుని ఉంటే ఆ మొత్తాన్ని తగ్గించి మిగిలిన డబ్బును ఖాతాలో వేస్తున్నారని తెలిసింది. పంట కోతల తరువాత వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదని రైతులు తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుతం కంది పంటను కోశారు కానీ ఇంకా కందుల కొనుగోలు కేంద్రం చేవెళ్ళ వ్యవసాయ మార్కెట్‌లో మొదలు కాలేదు. అందువలన రైతులు కమీషన్ ఏజంట్లకు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (క్వింటాలుకు రూ.8000) కంటే తక్కువ ధరకు (క్వింటాలుకు రూ.60006500కు) అమ్ముకుంటున్నారు. 'రైతు భరోసా' అందని కారణంగా వ్యాపారుల దగ్గర విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరువు తెచ్చుకుంటున్నారు. ఫలితంగా ఆ వ్యాపారులకే ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముతున్నారు రైతులుకౌలు రైతులకు ఎకరానికి రూ.1516 వేలు ప్రతి సంవత్సరం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. అంతేగాక వారికి పంట రుణాలు కూడా ఇవ్వడం లేదు. దేవుని ఎర్రవల్లిలో లాగానే రాష్ట్రంలో దాదాపు 50శాతం వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా పంట పెట్టుబడికి భూస్వాములు, కమీషన్ ఏజెంట్లు, బంధువులు, స్నేహితులపై ఆధారపడుతున్నారు. సంస్థాపరం కాని ఇలాంటి వ్యవస్థలపై ఆధారపడటం వల్ల వడ్డీ దోపిడీ ఎక్కువగానే ఉంటోంది. మరొక ముఖ్యమైన, అతి బాధాకరమైన విషయం ఏమిటంటే కౌలు రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నేరుగా అమ్ముకునే అవకాశం లేకపోవటం. వీరు అలా అమ్మాలంటే భూమి యజమాని తన పట్టా పాస్‌బుక్‌తో హాజరు కావాలి. ఇది చాలా క్రూరమైన నిబంధన. భూ యజమానులు అన్నిసార్లూ అందుబాటులో ఉండరు (కొందరు విదేశాలలో కూడా ఉన్నారు). ఉన్నా కొన్నిసార్లు రారు. ఫలితంగా కౌలు రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. భూ సంస్కరణలలో భాగంగా పశ్చిమబెంగాల్, త్రిపుర, జమ్మూ కశ్మీర్ మొదలైన రాష్ట్రాలలోని కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, ఇప్పుడు తెలంగాణలోను ఆ ప్రయత్నం జరగడంలేదు. 2011లో లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ యాక్ట్ ద్వారా రుణ అర్హత కార్డులు (రాజుజం) ఇచ్చే ప్రయత్నం ప్రారంభమైనా దాని అమలు కూడా చిత్తశుద్ధితో జరగడం లేదు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం ఇస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ఈ ఆర్థిక సహాయం అందలేదు. పంటల బీమా, రైతు బీమాతో పాటు కేంద్రం అమలుపరుస్తున్న పీఎంకిసాన్ సమ్మాన్ నిధి కింద ఒక ఎకరానికి ప్రతి ఏటా ఇచ్చే రూ.6000లు కౌలు రైతులకు ఇవ్వడం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల పెట్టుబడి బీమా), ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (నీటి పారుదల సౌకర్యాల కోసం ఆర్థిక సహాయం), వ్యవసాయ అవస్థాపన నిధి (అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) పథకాలకు కౌలు రైతులు అర్హులు కాదు. కిసాన్ క్రెడిట్ కార్డులు వీరికి ఇవ్వరు. వ్యవసాయ పదార్థాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి రైతులకు సూక్ష్మ సంస్థల ఏర్పాట్ల కోసం 35శాతం సబ్సిడీతో గరిష్ఠంగా ఇచ్చే రూ.10లక్షల ఆర్థిక సహాయం వీరికి అందడం లేదు. తోట పంటల (హార్టీ కల్చర్) పెంపకం కోసం అందించే ఆర్థిక సహాయానికి వీరు అర్హులు కాదు. ఇలా చెప్పుకుంటూ పోతే రైతుల కోసం అమలు జరుగుతున్న అన్ని ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు కౌలు రైతుల కష్టాలు తీర్చడానికి అనేక కమిటీలు తమ సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చాయి. అందులో జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కమిటీల దాకా ఉన్నాయి. దాదాపు అన్ని కమిటీలలో ప్రముఖంగా ఉన్న సాధారణ సిఫారసులు: 1) కౌలు రైతులకు చట్టబద్ధ గుర్తింపు తప్పనిసరి. 2) రాతపూర్వక లీజు ఒప్పందాలు. 3) పంట బీమా, విపత్తు పరిహారం, సబ్సిడీలలో నేరుగా చేర్చడం. 4) బ్యాంకు రుణాలకు ప్రత్యామ్నాయ భద్రత ఏర్పాట్లు. 5) కౌలు రైతులు మద్దతు ధర పొందేలా మార్కెటింగ్ సదుపాయాలు. 6) గ్రామ స్థాయి రికార్డుల్లో కౌలు వివరాలు నమోదు చేయడం. ఈ కమిటీల నివేదికలు పరిశీలించినప్పుడు అవి కౌలు రైతుల సమస్యలను అందరికీ తెలియజేయడమే కాదు, ఆ సమస్యల పరిష్కారం కోసం బుద్ధిజీవులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సూచనలు కూడా చేశారని స్పష్టంగా అర్థమవుతుంది. వాటి అమలుకు ప్రభుత్వాలు పూనుకుంటే కౌలు రైతుల సమస్యల పరిష్కారం అసాధ్యం కాదని కూడా అనిపిస్తుంది.

# జగన్ అరాచకీయమే కూటమికి రక్ష!

ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత చట్టపరంగా అరాచకశక్తుల పీచమణిచే తిరుగులేని అధికారం ఆయన కనుసన్నలలో ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు ఆ బాట పట్టలేదు. ఈ ఊహాతీత సంయమనం అటు తెలుగుదేశ శ్రేణులకూ, ఇటు సామాన్య జనానికీ మింగుడుపడలేదు. రాష్ట్రాన్ని చెరబట్టినవారిని వారి పాపాలకు వదిలేసి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పునర్నిర్మాణంపై దృష్టి పెట్టారు. అందుకే, రాష్ట్రంలో ఈ రోజు ప్రశాంత జీవన పరిస్థితులు కనిపిస్తున్నాయి. జగన్ పార్టీ నేతలు తరచుగా ప్రస్తావించే 'రెడ్ బుక్'కు బూజు పట్టడానికి కూడా కారకులు చంద్రబాబు నాయుడే. ఆయన శాంతికాముక, అభివృద్ధి మైండ్‌సెట్ కారణంగానే ఆ పుస్తకానికి పనిలేకుండా పోయింది. అందుకే అరాచక శక్తులకు మళ్ళీ ధైర్యం వచ్చింది. బలం కూడదీసుకుని నోటితో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. చంద్రబాబు నాయుడు పుట్టి పెరిగిన కుటుంబ పరిస్థితులకు ఫ్యాక్షన్ నేపథ్యం లేకపోవడం; ఆయన యూనివర్సిటీ స్థాయిలో చదువుకుని ఉండడం; ఆంధ్రుల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ కుమార్తెను వివాహమాడడం; ప్రజల మధ్యనే తొలి నుంచీ మసలడం; జాతీయ స్థాయి నేతలతో సాంగత్యం; అబ్దుల్ కలాం, వాజపేయి దగ్గరి నుంచి చంద్ర రాజేశ్వరరావు, ఇంద్రజిత్ గుప్తా, ఏచూరి సీతారామ్... ప్రకాశ్ కారత్ వంటి కమ్యూనిస్ట్ యోధానుయోధులతోపాటు, ములాయంసింగ్ యాదవ్ వంటి జాతీయ స్థాయి నేతలతో భుజం భుజం కలిపి రాజకీయాలలో పనిచేసే అవకాశం లభించడం... ఇలాంటి రాజకీయ, జీవితానుభవాలు ఆయన వ్యవహార శైలిని ఉన్నతంగా తీర్చిదిద్దాయి. నేలబారు, చిల్లర, దిగజారుడు రాజకీయాలకు ఆయనను దూరంగా ఉంచాయి. ఒక గంట ఖాళీ దొరికితే రాష్ట్రానికి ఏమి అదనపు సదుపాయం కల్పించాలా, ఏ సాంకేతికతను కొత్తగా పరిచయం చేయాలా అని ఆయన ఆలోచన చేస్తుంటే, ఆయన ప్రత్యర్థులు మాత్రం ఉన్న సమయాన్నంతా చంద్రబాబు నాయుడు మీదా, లోకేశ్ మీదా ఎలా బురద గుమ్మరించాలా అని ఆలోచించటానికే వెచ్చిస్తున్నారు. వారిద్దరి చుట్టూ తిరగడమే రాజకీయం అన్న స్థాయిలోనే ప్రత్యర్థుల ఆలోచన ఆగిపోయింది. రాష్ట్రం మంచి చెడ్డలు వారి ఆలోచనా పరిధికి అందనంత దూరంగా ఉండిపోయాయి. ఇటువంటి వారిని కూడా సహించి రాగద్వేషాలకు అతీతంగా తన పని తాను క్రియాశీలకంగా చేసుకుపోవడం చూస్తుంటే నేడు చంద్రబాబు నాయుడు కోపతాపాలు జయించిన ఒక మహర్షి లాగా కనిపిస్తున్నారు. ఆయన హయాంలో ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా కంటి మీద కునుకు తీస్తున్నారు. అర్ధరాత్రుళ్లు అపరాత్రుళ్లు ఏ ఆగంతుకులో, పోలీసులో గోడలు దూకో, తలుపులు బద్దలు కొట్టో ఇళ్లల్లోకి దూరి తమను నిద్ర మంచాల మీద నుంచే ఎత్తుకుపోతారేమోనన్న భయం ఇప్పుడు లేదు. పోలీసులు జనం మీద అకారణంగా పడడం లేదు. దళితుల మీదైనా సరే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి జైళ్లకు పంపడం మన పోలీసులకు తెలిసిన విద్యే అయినా, ఆ అరాచకాలు ఇప్పుడు వినపడటం లేదు. ఫిర్యాదులు ఇవ్వడానికి వెళ్ళే బాధితుల మీదే ఎదురు కేసులు పెట్టి లాకప్‌లలో వేయడం లేదు. వారి పాత బాసుల హయాంలో లాగా పోలీసులు అరాచకావతారాల్లో తాండవం చేయడానికి చంద్రబాబు నాయుడు అంగీకరించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా సామాన్య ప్రజలకు కావలసింది తమను వేధించని, భయపెట్టని ప్రభుత్వ యంత్రాంగం. తమ బతుకులు తమను స్వేచ్ఛగా, నిర్భీతిగా బతకనిచ్చే రాజకీయ వ్యవస్థ. ఆ స్వేచ్ఛా వాయువులే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిర్భయంగా పీలుస్తున్నారు. జగన్ బృందం చేష్టలు, మాటలు, ఆరోపణలు చూస్తున్న ప్రజలకు ఒక క్లారిటీ వస్తున్నది. గత పాపాలపై అయిదు పైసల పశ్చాత్తాపం కూడా జగన్ బృందంలో కనపడదు. వాళ్ళను మళ్ళీ అడుగుపెట్టనిస్తే రాష్ట్రం రావణకాష్టం అయిపోతుంది. 'రాజకీయ నేతలు' అనే నిర్వచనం అసలు వీరికి వర్తించదు. 2019కి ముందు ప్రజల్లో ఇలాంటి స్పష్టత లేదు. ఇప్పుడు ఎవరేమిటో తెలిసింది. ఇప్పుడు 'జగన్ నెవర్ అగైన్' అంటూ ఎవరూ ప్రత్యేకంగా నినాదాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆ శ్రమేదో జగన్ బృందమే పడుతున్నది కదా!

# ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి...

గతంలో వలే ఇప్పుడు కూడా అమెరికా దౌర్జన్య చర్య ఫలితం ఊహించలేనిదేమీ కాదు: ఇరాన్‌కు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో మళ్లీ ప్రారంభమైన అమెరికాఇజ్రాయెల్ దాడి మహా విధ్వంసంతో అల్లకల్లోలాన్ని సృష్టించింది. పరిస్థితులను ఇంకా భయానకం చేస్తోంది, అంతర్జాతీయ చమురు విపణి కుదేలయిపోతోంది. టెహ్రాన్ పాలకుల మద్దతు ఉన్న హెజ్బొల్లా, హౌతీ సాయుధ బృందాలు రంగంలోకి దిగడంతో కొత్త విద్వేషాలు రగుల్కొంటాయి, ఉగ్రవాద ప్రతీకారాలు విజృంభిస్తాయి. పాశ్చాత్య ప్రపంచ విరోధులు మాత్రమే పరమానందం పొందుతారు. సార్థక ఫలితాలు ఏవైనా సమకూరుతాయా? అసాధ్యం. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో అమెరికా నేతృత్వాన పాశ్చాత్య దేశాల జోక్యపు చేదు ఫలితమే ఇప్పుడూ ఇరాన్‌లో చూడబోతున్నాం. అఫ్ఘాన్, ఇరాక్‌లలో జోక్యాలు క్షమించరానివి! ఆ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోనేలేదు. ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి తాను నిర్దేశించినట్టు నడిచేలా చేయగలనని 21వ శతాబ్ది ప్రజలు ఎన్నుకున్న అమెరికా అధ్యక్షుడు ఒకరు విశ్వసించడం విస్మయకరం! నైతిక వివేచన పూర్తిగా కొరవడిన నిర్ణయ ఫలితమే ఇరాన్‌పై దాడి. జార్జి బుష్ హయాంలో 2003లో ఇరాక్ దురాక్రమణ, ఇప్పుడు ఇరాన్‌పై భీకర దాడులు రెండూ ఒకే విధమైనవి. ఇతర దేశాలలో అమెరికా జోక్యాలు వియత్నాంలోనూ, 1953లో సీఐఏ ఆధ్వర్యంలో జరిగిన పాలన మార్పు రెండూ అంతిమంగా విఫలమయ్యాయి. ఆ వైఫల్యాలకు అమెరికా భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. విదేశాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని నివారిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. అది కల్తీలేని బొంకుమాట. ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాల తీరుతెన్నులను ట్రంప్ మార్చివేయగలరని విశ్వసిస్తున్నవారు 1945 అనంతరం సామ్రాజ్యవాద దురహంకారంతో అది పాల్పడిన నీతిబాహ్య చర్యలను ఓసారి సమీక్షించండి. పూర్వపు అధ్యక్షులకు ట్రంప్ భిన్నమైన వ్యక్తి కాదు. జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి తీసుకువెళ్లిన తరువాత ఆ దేశంలోని చమురు సంపద మాత్రమే తనకు అవసరమని ట్రంప్ అన్నారు. అయితే ఆ తరువాత ఇతర విషయాలలో సంభవిస్తున్నది గమనిస్తే అమెరికా సామ్రాజ్యవాద జోక్యాల తుచ్ఛ చరిత్రకు భిన్నంగా లేదని అర్థమవుతుంది. జార్జి బుష్ మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ సైతం అబద్ధాలే పునాదిగా ఒక సంక్షోభాన్ని సృష్టించారు. బుష్, ఆయన సహ నేరస్థుడు టోనీ బ్లెయిర్ వలే ట్రంప్ సైతం ఉద్దేశపూర్వకంగా ఇరాన్ నుంచి సంభావ్య ముప్పును గోరంతలు కొండంతలు చేశారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని, వాటివల్ల యూరోపియన్ దేశాలలోని అమెరికా బలగాలకు ముప్పు ఏర్పడవచ్చని, ఆ క్షిపణులు అమెరికా భూభాగాలకు కూడా చేరగలవని పదే పదే చెప్పారు. సద్దాం హుస్సేన్ కల్పిత ఆయుధాల విషయంలో బుష్ ప్రభృతులు చేసినటువంటి తప్పుడు ప్రచారాన్నే ఇరాన్ విషయంలో ట్రంప్ చేశారు. ఇరాన్ దాడులకు సిద్ధమైనందునే తాము ముందస్తు దాడులు చేశామన్న ఇజ్రాయెల్ వాదనలో సత్యం ఏ మాత్రం లేదు. గత ఏడాది జూన్‌లో అమెరికాఇజ్రాయెల్ మొదటి సంయుక్త దాడి అనంతరం నెలకొన్న శాంతియుత పరిస్థితులను పరిరక్షించుకునేందుకే ఇరాన్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. అణ్వాయుధాల తయారీ సామర్థ్యాన్ని సైతం ఇరాన్ వేగంగా సమకూర్చుకుంటోందని ట్రంప్ చేస్తున్న వాదనను గత ఇరవై ఏళ్లుగా ఇరాన్ పాలనావ్యవస్థ సర్వోన్నత అధినేత మొదలు జూనియర్ మంత్రి దాకా ప్రతి ఒక్కరూ ఖండిస్తూ వస్తున్నారు. 'తాము ఎట్టి పరిస్థితులలోనూ అణ్వాయుధాన్ని అభివృద్ధి పరచబోమని' ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాషి నిన్నగాక మొన్న స్పష్టంగా ప్రకటించారు. దీనిపై వాద ప్రతివాదాలు జరిగాయి. అయితే ఇరాన్ అణ్వాయుధాల తయారీలో పురోగతి సాధించినట్టు ఎటువంటి రుజువులను అమెరికా, ఐక్యరాజ్యసమితి అధికారులుగానీ నెతన్యాహు గానీ ప్రపంచానికి వెల్లడించలేకపోయారు. 'అమెరికా ప్రజాస్వామ్యానికి, ప్రపంచ భద్రతకు ట్రంప్ ఒక పెనుముప్పుగా పరిణమించారు' అని బరాక్ ఒబామా పాలనలో జాతీయ భద్రతా వ్యవహారాలలో కీలక బాధ్యతలు నిర్వహించిన బెన్ రోడెస్ వ్యాఖ్యానించారు. మన ఆధిక్యతను అంగీకరించని, మన మార్గాన్ని అనుసరించేందుకు సుముఖంగా లేని దేశాలను లొంగదీసుకోవాలని అమెరికన్ ఆదర్శాలు పురిగొల్పుతాయా? అని రోడెస్ విస్మయం వ్యక్తం చేశారు. ఇతర దేశాల కంటే అమెరికా స్వాభావికంగా ప్రత్యేకమైనది, విభిన్నమైనది, ఉన్నతమైనదని ప్రవచించే అమెరికన్ అసాధారణవాదానికి ఈయనొక వ్యక్తీకరణ. అయితే ఆ అసాధారణ వాదం ఒక మిథ్యా విశ్వాసమే. ఇరాన్‌పై దాడికి సర్వసన్నాహాలు చేస్తూనే ట్రంప్ ఆ దేశంతో రెండోసారి చర్చలు జరిపారు! జెనీవాలో జరిగిన ఆ చర్చలు ఎంత ప్రహసనప్రాయమైనవో ఇప్పుడు తేటతెల్లమయింది.

తమ లక్ష్యాలను వెన్వెంటనే గరిష్ఠంగా సాధించుకోవడానికి సమష్టిగా పూనుకున్న ట్రంప్, నెతన్యాహులు ఇరాన్‌పై భీకర దాడులను ఇప్పట్లో నిలిపివేయడం జరగనిపని. 1979 ఇరానియన్ విప్లవంలో అమెరికాకు ఎదురైన అవమానాలకు అంతిమంగా ప్రతీకారం తీర్చుకున్న అధ్యక్షుడుగా చరిత్రలో నిలిచిపోవాలని ట్రంప్ అభిలషిస్తున్నారు. ఇరాన్‌ను తిరిగి పాశ్చాత్య ప్రపంచబాటలోకి తీసుకురావడంతో పాటు ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న కాంగ్రెస్ ఎన్నికలలో ఓటర్ల మద్దతును మళ్లీ కూడగట్టుకోవడమే ట్రంప్ లక్ష్యం. తన రేటింగ్‌ను అతివేగంగా, గణనీయంగా పునరుద్ధరించుకునేందుకు ఆయన ఆరాటపడుతున్నారు.

## చేతులెత్తేసిన ట్రంప్ ప్రభుత్వం...

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, జెరూసలేంలోని అమెరికా రాయబార కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తదుపరి నోటీసు ఇచ్చే వరకు తమ నివాసాల్లోనే లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. "ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికన్లను ఇజ్రాయెల్ నుంచి ఖాళీ చేయించే స్థితిలో లేదా నేరుగా వారికి సహాయం చేసే స్థితిలో రాయబార కార్యాలయం లేదు" అని జెరూసలేంలోని అమెరికా ఎంబసీ ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన భద్రతా హెచ్చరికలో స్పష్టం చేసింది.

**తరలింపు ప్రక్రియ ఇలా..** ఇజ్రాయెల్ పర్యాటక మంత్రిత్వ శాఖ నిన్నటి నుండి 'తాబా' సరిహద్దు దాటడానికి షటిల్ సర్వీసులను నడపడం ప్రారంభించిందని ఎంబసీ తెలిపింది. ఈ షటిల్ సర్వీసులో ప్రయాణించాలనుకునే పౌరులు పర్యాటక మంత్రిత్వ శాఖ యొక్క ఎవాక్యూషన్ ఫామ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించింది. ఈజిప్టుకు వెళ్లే తాబా భూ సరిహద్దు ప్రస్తుతం అందుబాటులో ఉందని, ఇది రోజుకు 24 గంటలు పనిచేస్తుందని పేర్కొంది.

**ఎంబసీ కీలక సూచన..** "పర్యాటక మంత్రిత్వ శాఖ నడుపుతున్న ఈ షటిల్ సర్వీసుల విషయంలో అమెరికా రాయబార కార్యాలయం ఎటువంటి సిఫార్సు చేయడం లేదు. ఒకవేళ మీరు ఈ మార్గం ద్వారా వెళ్లాలని నిర్ణయించుకుంటే, మీ భద్రతకు అమెరికా ప్రభుత్వం ఎటువంటి గ్యారెంటీ ఇవ్వదు. ఇజ్రాయెల్ వదిలి వెళ్లాలనుకునే వారికి కేవలం సమాచార సేకరణ కోసం మాత్రమే ఈ వివరాలు అందిస్తున్నాము" అని ఎంబసీ స్పష్టం చేసింది. అలాగే, జోర్డాన్ వెళ్లాలనుకునే వారు ఎయిలాట్ వరకు షటిల్‌లో వెళ్లి, అక్కడి నుండి స్వతంత్రంగా 'యిత్జాక్ రాబిన్' సరిహద్దుకు చేరుకోవచ్చని అమెరికా రాయబార కార్యాలయం వివరించింది.

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు. త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

## స్త్రీశక్తి పథకంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా ప్రవేశపెట్టి.. అమలు చేస్తోంది. అందులో ఒక్కటి స్త్రీ శక్తి పథకం. ఈ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పించారు. ఈ పథకంతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నాయి.ఈ మేరకు ప్రకాశం జిల్లా పోలీసుల అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షను వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గిందంటూ సీఎం చంద్రబాబు దృష్టికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తీసుకెళ్లారు.స్త్రీ శక్తి పథకం అమలుకు ఆరు నెలల ముందు, తర్వాత పోల్చుకుంటే..19 శాతం మేర మరణాలు తగ్గినట్టు ఈ జిల్లా పోలీసులు ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా అధ్యయనం చేయించాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. గతంతో పోల్చుకుంటే ప్రకాశం జిల్లాలో10 శాతం మేర మరణాలు తగ్గినట్టు నివేదికలో వెల్లడించారు.

## ఇంద్రకీలాద్రిపై 6నుంచి కుంభాభిషేకం

దేవస్థానం అర్చకులు, పాలకవర్గం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. గమ శాస్త్రాల ప్రకారం 12 ఏళ్లకు ఒకసారి ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేకానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

## రాజ్యసభ స్థానాలు.. ఒకరికా? ఇద్దరికా?

ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్‌ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు. నమ్ముకున్న సిద్దాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్దాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి పాలకల్తీకి ప్రభుత్వానిదే బాధ్యత

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణాకు ఇవ్వాలని సీపీఐ తరపున కోరుతున్నామని సిపి జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. విభజన సందర్భంగా ఎపిలు కలిపిన ఆ ఐదు గ్రామాలు తెలంగాణలో తిరిగి విలీనం చేయాలన్నరు. లేకుంటే తీవ్ర సమస్యలు వస్తాన్నారు. ధార్మిక సంస్థల్లో కఠినమైన పాలసీలు తీసుకురావటం ద్వారానే లడ్డూ కల్తీ లాంటి సమస్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిజాయితీగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరని, శ్రీలక్ష్మి చేసిన చిన్న తప్పిదం వలన ఆమె కెరీర్ దెబ్బతిందన్నారు. బాద్యతాయుతంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రలోభాలకు లొంగడంతోనే వ్యవస్తలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ లో జరిగిన దుర్ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని నారాయణ పేర్కొన్నారు. కల్తీ పాలు తాగటం వలన ప్రజలు చనిపోతున్నారని, డెయిరీలపై ప్రభుత్వ నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. నక్సలైట్లను చంపవచ్చు కానీ నక్సలిజాన్ని అంతం చేయలేరన్నారు. పేదరిక నిర్మూలన జరిగితే నక్సలిజం అవసరమే రాదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అణగదొక్కాలని అవినీతి మరక అంటించారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆరు వేల కోట్లు ఉన్నాయని.. రెండు వేల కోట్లు విడుదల చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ కేసును సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వానికి అప్పగించాలని నారాయణ కోరారు. అమెరికాకు ఎవరు ఎదురు తిరిగినా వారిపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులకు దిగడం దారుణమని సీపీఐ జాతీయ నేత నారాయణ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇరాన్ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకునే ప్రయత్నంగా యుద్ధం చేస్తుందన్నారు. దురాక్రమణ చేసేందుకే పలు కారణాలు చూపి యుద్ధం ప్రారంభించిందని అమెరికాపై మండిపడ్డారు.

# మార్చి 9న డోన్‌కు ముఖ్యమంత్రి రాక





## ఏర్పాట్లపై ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి సమీక్ష

నంది పత్రిక –డోన్ ఈ నెల 9వ తేదీన గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు డోన్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**కొత్తబుర్జులో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ** డోన్ మండలంలోని కొత్తబుర్జు గ్రామంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా నూతన పట్టాదారులకు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, అధికారులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే అధికారులకు మరియు నాయకులకు పలు కీలక సూచనలు చేశారు.మండల మరియు పట్టణ స్థాయి నాయకులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలి. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులలో ఎటువంటి లోటు రాకుండా చూడాలి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రవాణా మార్గాలను, పోలీసు యంత్రాంగంతో కలిసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలి. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా వేదికను సిద్ధం చేయాలి. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతంగా ఉండేలా,ఈ కార్యక్రమం ఒక పండుగలా సాగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎద్దుల దొడ్డి ప్రభాకర్ రెడ్డి, ఫణి రాజ్,అర్జున్ రెడ్డి,హరికిషన్, కేసన్న గౌడ్,ఖాజాపీర్,లక్ష్మి నారాయణ,అంకిరెడ్డి,కొంగణపల్లె మధు,దస్తగిరి,శ్రీనివాసులు నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 9న డోన్‌కు ముఖ్యమంత్రి రాక: ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి





నంది పత్రిక –డోన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన డోన్ మండలంలోని కొత్తబుర్జు గ్రామంలో పర్యటన లో భాగంగా నూతన పట్టాదారుల పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్న నేపథ్యంలో, సభ స్థలం హెలిప్యాడ్ ఏర్పాట్లను డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, కోట్ల రాఘవేందర్ రెడ్డి, ఆర్డీవో నరసింహులు డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తబుర్జులో సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ కోసం ఎంపిక చేసిన స్థలం, వీవీఐపీల రూట్ మ్యాప్, పార్కింగ్ వసతులు మరియు భద్రతా అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా రైతులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నూతన పాస్ పుస్తకాల పంపిణీ రైతులకు ఎంతో ఊరటనిచ్చే అంశం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీరు, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా డీఎస్పీకి తగిన సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ లు రాకేష్,ఇంతియాజ్, వలసల రామకృష్ణ,అర్జున్ రెడ్డి,లక్ష్మీనారాయణ, ఆర్ అండ్ బి అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం.

### అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే విడుదల చేయాలి.

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.




నంద్యాల ప్రతినిధి. మార్చి 03 . (నంది పత్రిక ):వేతనాల పెంపు, డిమాండ్ సాధన కోసం విజయవాడలోని ధర్నా చౌక్ నందుశాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వేలాదిమందిఅంగన్వాడి టీచర్లు, ఆయా లను నేటి తెల్లవారుజామున, నిద్రిస్తున్న సమయంలో, మహిళలు అనే కనికరం లేకుండాబలవంతంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్నిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఏ .రాజశేఖర్, జిల్లా కార్యదర్శి టి. రామ చంద్రుడు ప్రకటన ద్వారా ఖండించారు. సిపిఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ తక్షణమే అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, వారి నాయకత్వంతో ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరారు.ఎన్నికల ముందు అంగన్వాడి దీక్షల వద్దకు వచ్చి, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత బలవంతంగా పోలీసులచే అరెస్ట్ చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు.చంద్రబాబు కి నమ్మించిమోసం చేయటం వెన్న తో పెట్టిన విద్య అని విమర్శించారు. నియంతృత్వ పరిపాలన తలపించే విధంగా అంగన్వాడి మహిళలపై ప్రభుత్వం పోలీసులు జులుం ప్రదర్శించింది అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బారాయుడు, సహాయ కార్యదర్శులు వీరన్న, సురేష్, ప్రసాద్, బాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో దారుణ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న మాజీమంత్రి

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్న కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు.

## పరమటూరు లో సిమెంట్ రోడ్డు పనులకు శ్రీకారం



బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 3: బండిఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పరమటూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మించే పనులకు శ్రీకారం చుట్టారు. సిమెంట్ రోడ్డు నిర్మించేందుకు గాను శ్రీశైలం శాసనసభ్యుడు బుడ్డా రాజశేఖర రెడ్డి జాతీయ ఉపాధి హామీ పనుల క్రింద 20లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు.గ్రామంలోని సచివాలయం నుండి సుంకులమ్మ గుడి వరకు 300మీటర్ల దూరం వరకు ఈ సిమెంట్ రోడ్డును నిర్మించానున్నారు.పరమటూరు నుండి పెసరవాయి ప్రాంతం లో ఉన్న ఈ రోడ్డు గతంలో దారుణంగా ఉండేదని అప్పట్లో ఈ రోడ్డును రేగటి వంశ్యస్తులే మెటల్ రోడ్డుగా మార్చారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ సిమెంట్ రోడ్డు పనులను తెలుగుదేశం యువనాయకుడు,ఎత్తిపోతల నీటి కమిటీ చైర్మన్ అయిన రేగటి రాజశేఖర రెడ్డికి ఏమ్ఎల్ ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి అప్పగించారు.ఈ రోడ్డు నిర్మించేందుకు గాను ముందుగా గ్రామంలోని సుంకులమ్మ గుడివద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్డు పనులను ప్రారభించారు.ఈ కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి తో పాటు జనసేన పార్టీ మండల ఇంచార్జ్ సురేష్,పరమేశ్వర రెడ్డి,శ్రీకాంత్,పంచాయతీ కార్యదర్శి లక్ష్మి,ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ,మద్దిలేటీ,వెంకటేశ్వర్లు తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



## పేదల గృహ స్వప్నం నెరవేర్చడమే లక్ష్యం





బనగానపల్లె నియోజకవర్గం అవుకు మెట్ట ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కోసం అనువైన స్థలాన్ని రాష్ట్ర రోడ్లు & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారు పరిశీలించారు. నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ గారు, ఆర్డీవో నరేంద్రనాథ్ రెడ్డి గారు, ఎమ్మార్వో నారాయణరెడ్డి గారితో కలిసి స్థలాన్ని పరిశీలించిన మంత్రి గారు, దాదాపు 32003500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది అని తెలిపారు. దేవాదాయ శాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించే ప్రక్రియ పూర్తయిన అనంతరం కాలనీ అభివృద్ధి చేపట్టి పేదల గృహ స్వప్నాన్ని సాకారం చేస్తామని మంత్రి గారు పేర్కొన్నారు.





## ప్రాణాలు కోల్పోయిన డెలివరీ బాయ్ దిలీప్‌కు న్యాయం చేయాలి

### జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య డిమాండ్






పోరుమామిళ్ల / కాశినాయన మార్చి 3( నంది పత్రిక):కాశినాయన మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన కందుల దిలీప్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.దాదాపు పది రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు దిలీప్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను తొలుత పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కడప =×మీా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి మార్చినాడ ప్రాణాలు నిలబెట్టలేక సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మార్చి రెండవ తేదీన “దిలీప్‌కు న్యాయం జరగలేదు” అంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ ఎదుట శవాన్ని ఉంచి ఎమ్మార్పీఎస్ నాయకులు వారి బంధువులు నిరసన వ్యక్తం చేసారు.ఈ ఘటనపై పోరుమామిళ్ల మండల జనసేన అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య తీవ్రంగా స్పందించారు. “కూలీగా పనిచేసే యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించడం అమానుషం. దిలీప్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక భరోసా కల్పించాలి. ఈ నేరానికి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించి, మళ్లీ ఇలాంటి ఘటనలకు పాల్పడాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలి” అని చట్టం అందరికీ సమానమే అని గుర్తు చేశారు.దిలీప్ హత్య కేసులో ఇప్పటివరకు నిందితులను పట్టుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని లక్ష్మయ్య డిమాండ్ చేస్తున్నారు.

## రైతన్నలకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేసిన మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారు..



బనగానపల్లె నియోజకవర్గం జ్వాలాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారు రైతన్నలకు నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రి గారు స్వయంగా రైతులకు అందజేశారు.



# జంక్ ఫుడ్ కి దూరంగా ఉండండి

### అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవం - మార్చి 4న

### డాక్టర్. నవీన్ కుమార్, కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్



**కర్నూలు నంది పత్రిక.....** మితిమీరిన ఆహారపు అలవాట్లనే ఊబకాయం వస్తుంది. ప్రపంచంలో దీని వల్ల అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం మార్చి 4వ తేదీన అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం 2020 నాటికి ప్రతి పది మందిలో ఇద్దరు, 2030 వచ్చేనాటికి ప్రతి పదిమందిలో 5గురు ఊబకాయం సమస్యతో బాధపడుతారు అనే వివిధ సర్వేలు చెబుతున్నాయి. మారుతున్న జీవన శైలిలో భాగంగా సరైన ఆహార నియమాలు పాటించలేక జంక్ ఫుడ్ల వల్ల శరీరంలో అవసరానికి మించి కొవ్వు చేరి ఆరోగ్యానికి హాని చేసే ఒక వ్యాధినే ఊబకాయంగా పిలుస్తారు. దీనినే స్థూలకాయం అని కూడా అంటారు. మోతాదుకు మించి ఆహారం తీసుకోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, ధూమపాన వ్యసనం, ఒత్తిళ్లు, కొన్నిసార్లు వారసత్వం వల్ల కూడా దీనిబారిన పడొచ్చు. అంటే ఒక వ్యక్తి తన ఎత్తు, వయస్సుకు తగ్గట్లుగా ఉండాల్సిన బరువుకు మించితే దీనిని అనారోగ్య సమస్యగా గుర్తించవచ్చు. ఊబకాయం వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు, మధుమేహం, నిద్రలో సరిగా ఊపిరి తీసుకోలేకపోవడం (గురక), కీళ్లకు సంబంధించిన వ్యాధులు, కొన్ని రకాలైన క్యాన్సర్ లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. శరీరంలో అధిక కొవ్వు పెరగడం అంతిమంగా హృదయంపై ప్రభావం చూపనుంది. ఉదయం, సాయంత్రం వేళ కచ్చితంగా కొంత సమయం వ్యాయామం చేయాలని, చెమట పట్టేలా నడవడం, పరిగెత్తడం ద్వారా కొవ్వు కరిగించవచ్చు.

**జంక్ ఫుడ్ ప్రభావం** అధిక కేలరీలు కలిగి ఉండే ఆహారంగా చెప్పుకునే జంక్‌ఫుడ్ ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతోంది. పెద్దల పరిస్థితీ అంతే. సాచ్యురేటెడ్ కొవ్వులు, ఉప్పు, పంచదార పాళ్లు మోతాదుకు మించి ఉండే చిరుతిళ్లు తినడం ప్రమాదకరం. అంటే బర్గర్, పిజా, ఫ్రెంచి ఫ్రైస్, కేకులు, నూడిల్స్, చిప్స్, తీపి ఉండలు, పంచదార పెట్టిన సీరల్స్, ఫ్రైడ్, ఫాస్ట్ ఫుడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, రెడిమేడ్ కూల్ డ్రింక్స్ లాంటివి జంక్ ఫుడ్‌గానే చెప్పొచ్చు. ఇంకా మసలా చాట్, పకోడీలు, బజ్జీలు, టమోటో కెచప్, వెన్నతో కూడిన కేకులు, చాక్లెట్ డింగ్‌డాంగ్స్ లాంటివి కూడా ఎక్కువ తీసుకోవద్దు.

**మోతాదుకు మించి తినొద్దు** పిల్లలు టీవీ ముందు కూర్చొని చిరుతిళ్లు ఎక్కువగా తింటుంటారు. ఈ పద్ధతిని మాన్పించాలి. పెద్దలు వ్యాయామం చేయాలి. శారీరక శ్రమ ఖచ్చితంగా ఉండాలి. 2030 నాటికి భారతదేశంలో 2.7 కోట్ల మంది పిల్లల్లో ఊబకాయం వచ్చే అవకాశం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అలాగే కౌమర దశ పైబడిన వయసుల వారు 5 కోట్ల మందికి ఊబకాయంతో బాధపడుతారని నివేదికలు చెబుతున్నాయి. మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, ఫైబర్ ఉన్న పదార్థాలు తినాలి. మాంసాహారం, ధూమపానం, మద్యపానం అలవాట్లు మానాలి.

# పైపుల మార్పుకు ప్రజల సహకారం అవసరం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### సామాగ్రి అందిస్తే డ్రైనేజీల్లో పైప్‌లైన్ల తొలగింపు



ప్రజలు ఏర్పాటు చేసుకున్న కనెక్షన్ పైప్‌లు డ్రైనేజీ కాలువల్లో

**కర్నూలు నంది పత్రిక.....** నగరంలో డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైపుల మార్పుకు ప్రజల సహకారం అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్, అమినిటీస్ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, డ్రైనేజీ కాలువల్లో కలుషిత నీటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.ప్రతి అమినిటీస్ కార్యదర్శి క్షేత్రస్థాయిలో వెళ్లి అతిసారం ప్రబలకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో నగరపాలక సంస్థకు చెందిన పైప్‌లైన్ల మార్పుకు అవసరమైన ప్రతిపాదనలను వీలైనంత త్వరగా రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రధాన పైప్‌లైన్‌ల నుండి గృహాలకు ఉన్నట్లయితే, వాటి మార్పు అవసరాన్ని సంబంధిత యజమానులకు తెలియజేయాలని సూచించారు. వారి అంగీకారంతో యజమానులు మార్పుకు అవసరమైన సామాగ్రి అందిస్తే, మున్సిపల్ సిబ్బంది వెంటనే మార్పు పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు ఉండకుండా చూడడం అత్యంత అవసరమని తెలిపారు. కలుషిత నీటి వల్ల అతిసారం వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం లేకుండా ఈ పనులు పూర్తికావని, ప్రతి ఇంటి యజమాని బాధ్యతగా స్పందించి, స్థానిక సచివాలయంలో అమినిటీస్ కార్యదర్శిని సంప్రదించాలని, డ్రైనేజీ కాలువల్లో తాగునీటి కనెక్షన్ పైప్‌లైన్ల మార్పునకు అవసరమైన సామాగ్రి అందించాలని కమిషనర్ కోరారు. కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నులతోనే ప్రగతి

### నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడు

### మార్చి 31 వరకు ప్రతి రోజూ పన్ను వసూళ్లు



**కర్నూలు నంది పత్రిక.......** నగర ప్రజలు చెల్లించే పన్నులతోనే ప్రగతి సాధ్యమని నగరపాలక మేనేజర్ యన్.చిన్నరాముడు అన్నారు. మంగళవారం ఆయన నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూళ్ల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలవు దినమైన ఆదివారం, పండుగల దినాల్లో సైతం నగర ప్రజలు తమ ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుముల చెల్లించవచ్చని తెలిపారు. వచ్చే నెలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, మార్చి 31 వరకు నగరపాలక కార్యాలయంతో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను సెలవు రోజుల్లో సైతం పన్నులు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయం, కేఎంసి పాత కార్యాలయం, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయం, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయం, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయం, లక్ష్మి నగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పన్నులు చెల్లించవచ్చని, యూపీఐ ప్లాట్‌ఫాంల ద్వారా సైతం పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా సౌకర్యవంతంగా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బాల్య వివాహాల ద్వారా పిల్లల జీవితాల్లో సమస్యలు...ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు నంది పత్రిక....** బాల్యం అనేది అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం మరియు శారీరక, మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు...బాల్య వివాహ విముక్తి భారత్ పేరుతో కోనేరు ఎన్.జీ.ఓ సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా చేపట్టిన వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. .. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లల చదువులు మధ్యలో ఆగిపోయి జీవితాంతం సమస్యలు ఎదురవుతాయని, ఈ దురాచారాన్ని అరికట్టడానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు...ఈ కార్యక్రమంలో కోనేరు సంస్థ కోఆర్డినేటర్ మౌనిక,సి ఎస్ ఎం రామాంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్ మునుస్వామి, గ్రామ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు...

## అంగన్వాడీల అక్రమ అరెస్టులు తగదు :

### వి రఘురామమూర్తి. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు.




**నందికొట్కూరు మార్చి3( నంది పత్రిక)** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ, సీఐటీయూసీ, ఐ ఫ్ టీ యూ) ఆధ్వర్యంలో సామరస్యంగా విజయవాడలోని అలంకార్ సెంటర్ లొ ధర్నా చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం తగదని అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు వీ రఘురామ్ మూర్తి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద కేజీ రహదారిపై ఏఐటియుసి పట్టణ సమితి నాయకులు హంద్రీ నివా శ్రీనివాసులు ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీలు హెల్పర్లు మినీ వర్కర్లకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు పెరుగుతున్న నిత్యవసర ధరల కనుగుణంగా 2019 నుంచి వీరికి వేతనాలు పెరగలేదన్నారు.అంగన్వాడీల వేతనాలు పెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని గత ప్రభుత్వం పేర్కొందన్నారు తాము అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని అప్పటి ప్రతిపక్షంలోని టిడిపి నేతలు కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టి రెండు సంవత్సరాల, రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు పెంచలేదని విమర్శించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. 2024 మార్చిలో గ్రాట్యుటి అమలు చేస్తామని జీవో 8 ఇచ్చిన నేటికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేసేందుకు గైడ్ లైన్స్ రూపొందించలేదని మండిపడ్డారు

**డోన్ పట్టణ ఎస్ఐ నరేంద్రను సస్పెండ్ చేయాలి:-** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడ బయలుదేరుతున్న ఏఐటియుసి డోన్ పట్టణ కార్యదర్శి అబ్బాస్ పై అనవసరంగా దాడి చేసి కంటి ని గాయపరచిన డోన్ పట్టణ ఎస్ఐ నరేంద్ర పై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి అయన ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ నాయకులు నాగస్వాములు ఉస్మాన్ భాష మధు ఫయాజ్,మున్నా మధు,సుధాకర్ తదితరులు ఉన్నారు

## రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగు

### విశాఖకు తిరిగి ఐబిఎం రాక: డోలా

వైకాపా హయాంలో రాష్ట్రం నుంచి తరిమేసిన కంపెనీలన్నీ నేడు సీఎం చంద్రబాబుపై నమ్మకంతో మళ్లీ తిరిగొస్తున్నాయని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ ఐబీఎం.. విశాఖలో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు రావడం శుభపరిణామమని చెప్పారు. రానున్న మూడేళ్లలో ఆ సంస్థ రూ.322 కోట్ల విలువైన ఐటీ ఉత్పత్తులను ఎగుమతి చేయనుందని మంత్రి అన్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. నాడు కమీషన్ల కక్కుర్తితో జగన్ అండ్ కో రాష్ట్రంలోని పరిశ్రమలను తరిమేసి యువతను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని చెప్పారు.

## ఆర్ టి సి బస్సు ఎక్కబోయి..





**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 3:** ఆర్ టి సి బస్సు ఎక్కబోయి ఓ వ్యక్తి ప్రమాదానికి గురైన సంఘటన బండి ఆత్మకూరు బస్టాండ్ లో మంగళవారం నాడు జరిగింది. స్థానికుడైన నాగలూటి బాలయ్య అనేవ్యక్తి భార్యా సమేతంగా అమ్మవారి దర్శనం కొరకు గడివేముల కు వెళ్లేందుకు బస్టాండ్ లో వేచిచూస్తున్నాడు.ఆత్మకూరు డిపో నుండి బస్సు బండిఆత్మకూరుకు రాగానే ముందు భార్య బస్సు ఎక్కింది.తర్వాత బాలయ్య బస్సు ఎక్కుతుండగానే డ్రైవర్ ఇది గమనించకుండా బస్సును ముందుకు కదలించాడు.బస్సు వెనక వున్న కండక్టర్ కూడా ఈ విషయాన్ని గమనించ లేదు.దీంతో బాలయ్య బస్సులోనుండి కింద పడ్డాడు.బస్సు వెనక టైరు ఎడమ కాలిపై ఎక్కడంతో కాలు నుజ్జుగా అయిపోయి ఎముక బయటకు వచ్చింది.దీనితో భాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులను నిరసిస్తూ నిరసన



**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 3:** శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడి మహిళల అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎదుట సి ఐ టి యు మండల కమిటీ,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.శాంతి యుతంగా విజయవాడ లో మహా ధర్నాలో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేశారని,న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.దీన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ నందు నిరసన వ్యక్తం చేసి ఎస్ ఐ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడి నాయకులు వసంతమ్మ,ఆనందమ్మ,శ్యామలమ్మ, సిఐటియు నాయకులు రత్నమయ్య,రాజు,డేవిడ్ లు మాట్లాడుతూ ఏళ్ళతరబడి అంగన్వాడి వర్కర్లు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాకముందు 45రోజుల పాటు అంగన్వాడీలు సమ్మె చేసిన సందర్భంలో,మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వావాడిల సమస్యలను పరిష్కరిస్తామని,వేతనాలు పెంచుతామని గతంలో హామీ ఇచ్చారని,ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా,సమస్యలు పరిష్కరించకపోగా,అనేక సమస్యలు పరిష్కరించామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని నాయకులు విచారం వ్యక్తం చేశారు.

## ఐబీపీఎస్, ఆర్ఆర్ బి ఆఫీసర్స్ బ్యాంక్ ఉద్యోగాలల్లో గురు రాఘవేంద్ర విద్యార్థుల ప్రభంజనం



**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 3 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 2025 అకడమిక్ సంవత్సరానికి గాను రీజినల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్ బి) ఐబీపీఎస్ బ్యాంకుల నందు 70 ఆఫీసర్స్ ఉద్యోగాలను సాధించినట్లుగా గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డా.పి దస్తగిరి రెడ్డి గారు తెలిపారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ ఆవరణలో ఉద్యోగాలను సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేయడమైనది. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి. మౌలాలి రెడ్డి గారు మాట్లాడుతూ మాకున్న ఒకే బ్రాంచ్ లో దేశంలోనే అధికంగా ఆఫీసర్స్ మరియు క్లరికల్ ఉద్యోగాలను మా విద్యార్థులు సాధించారని తెలిపారు. 1989వ సంవత్సరం నుండి 2026వ సంవత్సరం వరకు మా కోచింగ్ సెంటర్ నుండి 44,000 వేల మంది విద్యార్థులు బ్యాంకు ఉద్యోగాలను సాధించారు. నేటితరం విద్యార్థులకు ఆధునిక టెక్నాలజితో కూడిన విద్యావిధానాలతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాము అనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. అని తెలుపుతూ విద్యార్థుల విజయాలను ప్రశంసించారు. 2026 సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో వేలాదిగా ఆఫీసర్స్ మరియు క్లరికల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడుచున్నవి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న యువతీ, యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనతి కాలంలో బ్యాంకు ఉద్యోగులుగా స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నాము. సమాజానికి తమ వంతుగా కృషి చేయాలనే సదుద్దేశంతో నిరుద్యోగ యువతీ యువకులకు అతి తక్కువ ఫీజులతోనే ఉద్యోగం వచ్చేంతవరకు శిక్షణ అందిస్తున్నాము. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మరియు టీచింగ్ ,నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ప్రశాంతముగా మండల పరిషత్ సమావేశం




**జూపాడుబంగ్లా మార్చి 3 (నంది పత్రిక)** మండల పరిషత్ కార్యాలయంలో తాత్కాలిక గౌరవ మండల పరిషత్ అధ్యక్షురాలు టి. వెంకట రవణమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా తాత్కాలిక గౌరవ అధ్యక్షురాలు మాట్లాడుతూ మండల అభివృద్ధి అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, 80 బన్నూరు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# పోలీసుల సంక్షేమమే ముఖ్యం .





### అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన...

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

కర్నూలు నంది పత్రిక...... మార్చి 8న జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.పోలీసుల సంక్షేమమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ గారు సూచించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కర్నూలు ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ శిబిరంలో ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ...మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళా సాధికారతలో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని, మహిళలు శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు.జిల్లా పోలీసు శాఖ పోలీసుల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందన్నారు. 185 మంది కి రక్తపోటు, షుగర్, ఈసిజి, టుడిఈకో, పిఎఫ్ టి , బి ఎమ్ డి వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం వైద్యుల బృందాన్ని కర్నూలు ఎస్పీ అభినందించి, శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్రబాబు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు మంజునాథ్, రఘునందిని, సువర్ణ, సింధూర, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, మహిళా పీఎస్ సీఐ రామయ్యనాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## రెవెన్యూ క్లినిక్, స్పెషల్ క్యాంప్ ల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, నంది పత్రిక.....రెవెన్యూ క్లినిక్, స్పెషల్ క్యాంప్ ల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్డీఓ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, హౌసింగ్, అక్షరాంధ్ర, ఉపాధి హామీ, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ౣ4 తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్, స్పెషల్ క్యాంప్ ల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా చాలా అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ కు సూచించారు.పిజిఆర్ఎస్ కి సంబంధించి ఇంప్రాపర్ రెడ్రెస్సల్ చేస్తున్నారని, ఫిర్యాదులకు సంబంధం లేని ఎండార్స్మెంట్ లు ఇస్తున్నారని, అర్జిదారునితో +=ూ (+తీఅవఝుఅఎవ =వసతీవంయిశ్రీ ూటటఅఎవతీ) స్వయంగా మాట్లాడడం లేదు, ఎండార్స్మెంట్ ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివి జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ అంశానికి సంబంధించి కౌతాళం ఈఓఆర్డీ, ఆదోని డివిజన్‌కు చెందిన డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, ఎమ్మిగనూరు ఈఓఆర్డీ లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓర్వకల్లు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కల్లూరు, బెలగల్, పత్తికొండ తహసిల్దార్ ల వద్ద కేసుల రీ ఓపెన్ శాతం ఎక్కువగా ఉన్నాయని రీ ఓపెన్ శాతం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్ టూ వ్యూ లో వార్డు ప్లానింగ్ సెక్రెటరీ, క్రాంతి నగర్ , ఆదోని 9 రోజుల నుండి అర్జీలు చూడకుండా పెండింగ్ లో ఉంచారని, వారికి నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదోని మున్సిపల్ కమిషనర్ వారిని ఆదేశించారు. ఎట్ టూ వ్యూ లో అర్జీలు చూడకుండా పెండింగ్ లో ఉండకూడదని, ఎప్పటికప్పుడు చూడాలన్నారు.ముఖ్యమంత్రి ఏ సమయంలోనైనా మండలాలను నేరుగా సందర్శించవచ్చని, కాబట్టి మండల ప్రత్యేకాధికారులు ఆయా మండలాల్లో జరుగుతున్న అన్ని అంశాలపై పూర్తి పట్టు కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లు, పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ప్రతి మండల ప్రత్యేక అధికారి వద్ద మండలానికి సంబంధించిన అన్ని వివరాలతో నివేదిక సిద్ధంగా ఉండాలన్నారు. మండలాల్లో మహిళా శిశు సంక్షేమం, హాస్టళ్ల పరిస్థితి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు సరిగా లేదని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.హౌసింగ్ కి సంబంధించి ఆప్షన్3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 1457 ఇళ్ల నిర్మాణాల లోపాలను సరిచేయడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. ఉగాది నాటికి పూర్తి చేయాల్సిన ఇళ్లను నిర్మించడంలో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి సారించి వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె పండుగ 2.0 కింద చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలలో భాగంగా ఆస్పరి లో 10 పనులు, కౌతాళం లో 10 పనులు, మంత్రాలయం లో 23 పనులు ఇంకా గ్రౌండింగ్ కాలేదని, 2 రోజుల్లో గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ అసిస్టెంట్ ఇంజనీర్ లను ఆదేశించారు.అనంతరం అక్షరాంధ్ర, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ రెవెన్యూ క్లినిక్, స్పెషల్ క్యాంప్ ల పెండింగ్ దరఖాస్తులు, డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల కరెక్షన్ ల అంశం పై కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓ లతో లోతుగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్వో వెంకట నారాయణమ్మ, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, జిల్లా పిజిఆర్ ఎస్ నోడల్ అధికారి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, హౌసింగ్ పిడి చిరంజీవి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.





బేతంచెర్ల మార్చి 3 ( నందిపత్రిక ) .కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా, అంగన్వాడీలను అరెస్టు చేయడం అన్యాయం. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అన్యాయంగా రాత్రికి రాత్రే అంగన్వాడీలను అరెస్టు చేయడం అన్యాయమని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలనుకోవడం ఎవరి తరం కాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వై ఎల్లయ్య, మండల నాయకులు ఈ వేణుగోపాల్, మధు శేఖర్ అన్నారు. శాంతియుతంగా విజయవాడ లో ధర్నా చేస్తున్న అంగన్వాడీలను అన్యాయంగా అరెస్టు చేసినందుకు బేతంచర్ల పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నందు అంగన్వాడి పట్టణ కార్యదర్శి ఎస్ గుల్జార్ బి, మండల నాయకురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి నెలకు 26 వేల రూపాయల జీతాన్ని అమలు చేయాలని ఐదు రోజులుగా జిల్లాలో రిలే నిరాహార దీక్షలు చేసి రెండవ తేదీ చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా అలంకార్ ధర్నా చౌక్ దగ్గర శాంతియుతంగా అంగన్వాడీలు నిరసన తెలియజేస్తే, ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం నిర్లక్ష్యం చేసినందువలన సమస్యలు పరిష్కరించేంతవరకు ఇక్కడే బీస్పించుకొని కూర్చుంటామని రాత్రి అక్కడే నిరసన చేసి అలసి నిద్రిస్తున్న సమయంలో వందలాది మంది పోలీసులను ఉసి గొల్పి అర్ధరాత్రి అంగన్వాడీలను అరెస్టు చేసి స్టేషన్కు తీసుకెళ్లడం చాలా దుర్మార్గమని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 42 రోజులు అంగన్వాడీలు సమ్మె చేస్తే ఆ సమ్మె సిబిరాల్లోకి టిడిపి నాయకులు ఎమ్మెల్యేలు వచ్చి అంగన్వాడీలకు మద్దతు ఇచ్చారు అంతేకాకుండా ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ సమయంలో ఆళ్లగడ్డ కు వచ్చిన సందర్భంగా సిఐటియు అంగన్వాడి అగ్ర నాయకత్వం వెళ్లి విన్నవించుకోగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పోవడం చంద్రబాబుకు అలవాటేనని వారు విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు నెలకు 26 వేల జీతం, సంక్షేమ పథకాల వర్తింపు, రిటైర్మెంట్ అయిన తర్వాత జీవితంలో సగం పెన్షన్ సౌకర్యం, సుప్రీంకోర్టు ఇచ్చిన హామీలను నెరవేర్చి అంగన్వాడీలకు న్యాయం చేయాలని లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు బి రామాంజనేయులు, రామకృష్ణ, ఎస్ కే భాష, వరాలమ్మ, లక్ష్మీదేవి, అనూష, అంజలి, చంద్రకళ, అరుణ, చందన, శోభ, మేరీ, శ్రీదేవి, సంతోషమ్మ, రాధాదేవి, శివలక్ష్మి, పద్మావతి, సరస్వతి, సరోజ, మరియమ్మ, భూలక్ష్మి, మహేశ్వరి, దేవమణి, విజయమని, మద్దమ్మ, వెంకటరమణ, నాగరాజు, వెంకటేష్ నాయక్, నారాయణ, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు..

### ఉపకమీషనర్ & ఈవో ఎం. రామాంజనేయులు



బేతంచెర్ల మార్చి 3 ( నందిపత్రిక ). బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం, లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం,శ్రీ మద్దు లేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం.నందు శ్రీ స్వామివారికి, అమ్మవారికి భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు బుధవారం నాడు హుండీల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ & ఈఓ ఎం.రామాంజనేయులు మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. గతేడాది డిసెంబర్ 16వ తేది నుంచి ఈ మంగళవారం (మార్చినెల 3 వతేది)వరకు సుమారుగా 78 రోజులు హుండీని జిల్లా దేవాదాయ తనిఖీ అధికారి డి. రమేష్ పర్యవేక్షణలో, లెక్కింపు చేపట్టనున్నారని ఉపకమీషనర్ & ఈఓ తెలిపారు.

## వృద్ధుల సంక్షేమ చట్టాలపై నల్సార్ న్యూ మాడ్యూల్ అవగాహన సదస్సు.



నందికొట్కూర్ మార్చి3 (నందిపత్రిక ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం నందికొట్కూరు పట్టణ సమీపంలోని శ్రీ కాళీ ప్రసాద అశ్రిత ఆశ్రమం నందు వృద్ధుల సంక్షేమ చట్టాల పై నల్సా న్యూ మాడ్యూల్ అవగాహన సదస్సు పల్లె ప్రియాంక సేవ సమితి అధ్యక్షులు రిటైర్డ్ జిల్లా జడ్జి మోహన్ రావు, మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి వి దివ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి దివ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు వృద్ధుల పౌరుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం పిల్లలనుండి నిరాదరణ గురైన తల్లిదండ్రులకు తమ కుమారుల నుండి చట్ట ప్రకారం భరణం పొందే హక్కు కలదని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసము, విద్య హక్కు హెల్ప్ లైన్ నెంబర్ 1098, మహిళల కొరకు హెల్ప్ లైన్ నెంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్ లైన్ నంబర్15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగుల హెల్ప్ లైన్ నెంబర్ 14456 లను సంప్రదించి న్యాయ సేవలు పొందవచ్చునన్నారు. అనంతరం వారు ఆశ్రమం నందు ఉన్న వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం నందు మొక్కలు నాటిన అనంతరం వృద్ధులకు కుట్టు మిషన్ ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వి శరభయ్య, ఏ జి పి మహేశ్వరుడు, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు కే వెంకటేశ్వర్లు, ఎస్ మద్దయ్య, టీ నాగ మద్దిలేటి, ప్యారా లీగల్ వాలంటీర్స్ మరియు వృద్ధులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి అండగా డి సి సి చైర్మెన్

### దిలీప్ హత్యపై స్పందించిన మంచురి సూర్యనారాయణ రెడ్డి తక్షణ ఆర్థిక సాయం

కాశినయన, మార్చి 3(నంది పత్రిక ):కడప జిల్లా శ్రీ అవధూత కాశీనాయన మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దిలీప్ అత్యంత కిరాతక హత్యకు గురైన ఘటన ప్రతి మనిషి మనసును కలచివేసింది. అమాయక యువకుడిపై పెట్రోల్ పోసి దహనం చేయడం మానవత్వానికి మచ్చగా మారింది. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాకుండాడ సమాజానికే జరిగిన అవమానకర ఘటనగా మారింది.ఈ దారుణ ఘటనపై కడప డి సి సి బ్యాంక్ చైర్మెన్ మంచురి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం శ్రీ అవధూత కాశీనాయన మండలంలోని గంగనపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కొడుకుని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతమని ఆయన పేర్కొన్నారు. వారి కన్నీళ్లను చూసిన ప్రతివారూ కలత చెందకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈ కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన వంతుగా తక్షణ సహాయంగా రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండాడ బాధిత కుటుంబానికి "మేమున్నాం" అనే భరోసాకు చిహ్నమని అన్నారు.ఈ అమానుష ఘటనకు పాల్పడిన దుర్మార్గులను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్ష విధించాలని పోలీసులను ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి ప్రభావం ఉన్నవారైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని తెలిపారు.మన కూటమి ప్రభుత్వం దళితుల రక్షణకు కట్టుబడి ఉందని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు ఆర్థిక సహాయం, న్యాయ సహాయం, భద్రత త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమాజంలో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ యువనాయకులు చెరుకూరి రవికుమార్, డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అరవ శ్రీనివాసులు, భిరం జయరామిరెడ్డి, బాలిరెడ్డి, ప్రహల్లదరెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, మొగల్ రహమతుల్లా, రామయ్య, శంకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, క్రిష్ణారెడ్డి, సుబ్బారాయుడు యాదవ్, కరుణాకర్, సమరసింహారెడ్డి, వివరమిరెడ్డి, షేక్ రఫీ, సురేంద్ర, పగిడి సందీప్, మిట్ట వంశీ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు.

# ఘనంగా రమణీయంగా..

# శ్రీ ప్రహ్లాద వరదుని రథోత్సవం





## రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 3 నంది పత్రిక :** 108 దివ్య క్షేత్రాలు లో ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలశీ లో అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సమక్షంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 11వ రోజైన మంగళవారం దిగువ అహోబిలంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామానుజన్ ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకొని వచ్చి రథంలో ఆసీనులను చేశారు. వేలాదిమంది భక్తులు తిలకిస్తుండగా పీఠాధిపతి స్వామి పూజలు నిర్వహించగానే నరసింహ స్వామి గోవింద నామ స్మరణ మధ్య రథం ముందుకు సాగింది. ఆలయ మాడవీధుల గుండా రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ కళ్యాణోత్సవంలో స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి అవకాశం లేని వాళ్ళు రథోత్సవం లో దర్శించుకుంటే సకల శుభాలు సిద్ధిస్తాయన్నారు. ఈ రథోత్సవంలో నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి, ఆయన సోదరుడు గంగుల సుదర్శన్ రెడ్డి, కుమారులు గంగుల ఫ ణికృష్ణారెడ్డి, గంగుల భరత్ సింహారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కే డి సి సి మాజీ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏ ఎస్ పి యుగంధర్ బాబు ఆధ్వర్యంలో సీఐ బివి రమణ, రూరల్ ఎస్ఐ వరప్రసాద్ లు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అహోబిల గిరులు గోవింద నామస్మరణతో మారుమ్రుగాయి.

**నేడు అహోబిలంలో...** ఎగువ అహోబిలంలో బుధవారం ఉదయం శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఉదయం ఉత్సవం, చక్రవర్తి స్నానము, సాయంత్రం ద్వాదశరాధనం, పుష్ప యాగం, రాత్రి గరుడోత్సవం, ధ్వజ అవరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు దిగువ అహోబిలంలో ముగుస్తాయని దేవస్థానం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి ఎల్ ఎన్ రామానుజన్ తెలిపారు.











## రాయలసీమ ఎక్స్ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహణ



**నంద్యాల బ్యూరో, మార్చి 03(నంది పత్రిక):-** రాయలసీమ ఎక్స్ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ హెడ్ మదన్ మోహన్ నాయకత్వంలో జరిగిన ఈ వేడుకలు సంస్థ ప్రాంగణంలో ఆనందోత్సాహాల మధ్య సాగాయి. రంగుల పండుగ సందర్భంగా సిబ్బంది, వాహనదారులు, ట్రక్ డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ హెడ్ మదన్ మోహన్ మాట్లాడుతూ హోలీ పండుగ సంతోషం, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఉద్యోగులు, వాహనదారులు, ట్రక్ డ్రైవర్లతో కలిసి పండుగను జరుపుకోవడం సంస్థకు ఆనందదాయకమని పేర్కొన్నారు. సంస్థ ఎప్పటికప్పుడు సామాజిక బాధ్యతను గుర్తుంచుకుని ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని వెల్లడించారు. వేడుకల భాగంగా టోల్ ప్లాజా ద్వారా ప్రయాణిస్తున్న వాహనదారులు మరియు ట్రక్ డ్రైవర్లకు స్వీట్లు పంపిణీ చేసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగ వాతావరణంలో సంగీతం, హర్షధ్వానాలతో ప్రాంగణం మార్మోగింది. టోల్ ప్లాజా సిబ్బంది సైతం ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సిబ్బంది పరస్పరం రంగులు పూసుకుంటూ ఐక్యతను చాటారు. పండుగను సురక్షితంగా, సంతోషకరంగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక మరియు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉద్యోగుల మధ్య ఐక్యత, సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రాజెక్ట్ హెడ్ వెల్లడించారు.



## నేర నివారణ లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్...

### రోడ్డు ప్రమాదాల నివారణ....

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు...



**నంద్యాల క్రైం, మార్చి03(నంది పత్రిక):-** జిల్లావ్యాప్తంగా విసిబుల్ పోలీసింగ్ లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి సిబ్బంది సహాయంతో ముఖ్యమైన కూడలిలో, రద్దీ ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో వాహనాల తనిఖీలు నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ వాహనదారులు స్వీయ క్రమశిక్షణతో రహదారి నియమాలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలు కొంతవరకు నివారించవచ్చునన్నారు. మోటార్ సైకిల్ పై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు వారి ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని, ఇది చట్టరీత్యా నేరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ ,ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్ మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంకెన్ డ్రైవ్) వంటి నిబంధనలు ఉల్లంఘించరాదు. రోడ్డు భద్రత నియమాలు కేవలం జరిమానాల కోసం కాదని, మీ కుటుంబ సభ్యుల కోసం మీరు సురక్షితంగా మీ గమ్యస్థానాలు చేరుకునేలా చేయడమేనని పోలీసులు గుర్తు చేస్తున్నారు.



## రెవెన్యూ క్లినికల్ ల ద్వారా భూ సమస్యల పరిష్కారం వేగవంతం

**ప్రజలు రెవిన్యూ క్లినిక్లను సద్వినియోగం చేసుకోవాలి**

**8 విడతలుగా 126 దరఖాస్తులు పరిష్కారం..**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో: మార్చి 3, నంది పత్రిక.** రెవెన్యూ క్లినికల్ ల ద్వారా భూ సమస్యల పరిష్కారం వేగవంతంగా నిర్వహించడం జరుగుచున్నదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే పీజీఆర్ఎస్ తో పాటు సమాంతరంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ లను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. డిసెంబర్ 29,2025న రెవెన్యూ క్లినిక్ లు ప్రారంభం నాటి నుండి మార్చి 2, 2026 వరకు ఎనిమిది దఫాలుగా రెవెన్యూ క్లినిక్ లను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 420 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 97 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, 29 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, ఇంకా 294 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. జిల్లాలోని డివిజన్ ల వారీగా భీమవరం డివిజన్ ఏడు మండలాల్లో 168 దరఖాస్తులు అందగా వీటిలో 43 పరిష్కరించడం జరిగిందని, 11 తిరస్కరించడం జరిగిందని, ఇంకా 114 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. నరసాపురం డివిజన్ ఎనిమిది మండలాల్లో 169 దరఖాస్తులు అందగా 43 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, 11 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, ఇంకా 115 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ లోని ఐదు మండలాల్లో 83 దరఖాస్తులు అందగా 11 దరఖాస్తుల పరిష్కరించడం జరిగిందని, 7 దరఖాస్తును తిరస్కరించడం జరిగిందని 65 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. పరిష్కారానికి మిగిలిన దరఖాస్తులు వివిధ దశలలో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువు లోపుగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సదరు ఫిర్యాదులపై విచారణకు ఎక్కువ సమయం ఉండటం వలన వాటిని పూర్తిగా అవగాహన చేసుకుని నాణ్యతతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవిన్యూ క్లినికల్ ద్వారా భూ సమస్యలకు చక్కటి పరిష్కారం లభించిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.



## నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి



**బనగానపల్లె మార్చి 3నందిపత్రిక** బనగానపల్లె మండల పరిధిలోని జ్వాలాపురం గ్రామంలోమంగళవారం రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను స్వయంగా రైతులకు అందజేశారు.కార్యక్రమం లో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, స్థానిక తహసీల్దార్ నారాయణరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**మహానంది,మార్చి 03 (నంది పత్రిక ):–** శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.మంగళవారం మహానంది మండలం గోపవరం గ్రామం సమీపంలో వున్న సెయింట్ జాన్స్ మనో వికాస కేంద్రంలో తెలుగుగంగ డిస్ట్రిబ్యూటీ చైర్మన్ చింతం క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నురు రామలింగారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ విధులు నిర్వహించే వారు ఎంతో గొప్ప మనసున్న వారన్నారు.తమ వంతు సహాయంగా ప్రభుత్వం నుండి ఏదైనా అవకాశం వుంటే తప్పకుండా సహకరిస్తామని తెలిపారు.అనంతరం విద్యార్థులకు కేక్ తో పాటు తినుబండారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశశ్విని,సిస్టర్ రీనా జోష్,మహానంది మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి, మండల క్లస్టర్ ఇంచార్జి నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్యామల జనార్దన్ రెడ్డి,శశికళ కొండారెడ్డి,మహానంది దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున,మాజీ సర్పంచ్ లు రాముడు,నీటి సంఘం అధ్యక్షులు కసెట్టి శ్రీనివాసులు,టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు

ఉల్లి మధు,యూనిట్ ఇంచార్జ్ భాష్యం రాముడు గౌడ్, రంగస్వామి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్త రవి స్వామి,గద్వాల శేఖర్,ఉమాదేవి,సుదర్శన్ రెడ్డి,పటాల శ్రీను, పాశం శ్రీనివాసులు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరెస్టులపై అంగన్వాడీల నిరసన.

### ఏఐటీయూసీ అంగన్వాడి వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్



**ఆళ్లగడ్డ )చాగలమర్రి ప్రతినిధి, మార్చి 3 నంది పత్రిక** అంగన్వాడీల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చేపట్టిన ధర్నాను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న మహిళలను అరెస్టు చేయడం దారుణం అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వేతనాల కోసం ఉద్యమం చేస్తుండగా ఎటువంటి న్యాయం చేయకపోవడంతో రాష్ట్ర కమిటీ సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. వేతనాలు పెంచి పలు డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పి మహిళా ఓట్లతో అధికారం చేపట్టి నిర్లక్ష్యం చేయడం దారుణం అన్నారు. ధరలకు అనుగుణంగా వేతన చట్ట ప్రకారం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అంగన్వాడీల తో చర్చలు జరిపి న్యాయపరమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరారు.

## కేతుగ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మహానంది ఆలయం మూసివేత

### సంప్రోక్షణ,శుద్ధి కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతి






**మహానంది మార్చి 03 (నంది పత్రిక):–** కేతుగ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం మహానంది ఆలయం తలుపులు దేవస్థానం అధికారులు మూసివేశారు.ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పండితులు,అర్చకులు శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆలయ ద్వారాలు మూసివేశారు. గ్రహణానంతరం రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు తెరిచి ఆలయమంతా కడిగి సంప్రోక్షణ,

శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

## వీడిన సంపూర్ణ చంద్రగ్రహణం

### శ్రీ పి శ్రీనివాసాచార్యులు




**శిరివెళ్ల (కోటపాడు):–** చంద్ర గ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రారంభం అయ్యి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణ కాల సమయం పట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ పి శ్రీనివాసచార్యులు తెలిపారు మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ పుబ్బ నక్షత్రంలో సింహారాశిలో కేతుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం ఇండియాలో గ్రహణ ప్రారంభం సమయంలో కనిపించలేదని. చివరి ఆఖర్లో అద్భుత దృశ్యం అవిశ్రుతమైనట్లు ఆయన తెలియజేశారు. అనంతరం ఆలయాలలో గ్రహణానంతర శుద్ధి కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## కుల మతాలకతీతంగా ఉరుసు మహోత్సవాలు..



**ఆళ్లగడ్డ(చాగలమర్రి) ప్రతినిధి మార్చి 3 (నేడు )** చాగలమర్రి మండల పరిధిలోని కృష్ణం పల్లె, పెద్ద వంగలి గ్రామాలలో ఉరుసు మహోత్సవాలు దర్గా నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం, మంగళవారం ఉదయం, రాత్రి సమయంలో కులాలకు మతాలకు అతీతంగా కడప ప్రొద్దుటూరు, దువ్వూరు, రాజుపాలెం, కూలూరు, ఆళ్లగడ్డ, చాగలమర్రి కాన గూడూరు తదితర గ్రామాల నుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. దర్గాలో అల్లాకు ప్రత్యేక ప్రార్థనలతో పాటు మృక్కుబడులను చెల్లించారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వాహకులు ఏర్పాటు చేశారు.ఉరుసు మహోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై రాజారెడ్డి డీఎస్పీ సీఐ ఆదేశాల మేరకు బందోబస్తు నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట:

### కేసీ కెనాల్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి



**మహానంది,మార్చి 03 (నంది పత్రిక):–** కూటమి ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకురాలు శశికళ కొండారెడ్డి ఆధ్వర్యంలో దీపం పథకం కింద ఉచిత గ్యాస్,పొయ్యిలను పంపిణీ చేశారు.అనంతరం కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి,మండల క్లస్టర్ ఇంచార్జి నరాల చంద్రమౌళిశ్వర్ రెడ్డి,మండల యూనిట్ ఇన్చార్జి భాష్యం రాముడు గౌడ్, టిడిపి నాయకులు ఉల్లి మధు,పాశం శ్రీనివాసులు, తెలుగుగంగ 9వ బ్లాక్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, పటాల శ్రీనివాసులు,ఉమాదేవి,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమాసియా ఘర్షణలు

### ముగ్గురు భారత నావికుల మృతి

పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు భారతదేశానికి చెందిన ముగ్గురు నావికులు మృతి చెందినట్లు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించింది. ఒమన్ తీర ప్రాంతాల్లో ఉన్న పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. షిప్ ఆపరేటర్ల భద్రతను కచ్చితంగా దృష్టిలోఉంచుకోవాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే రిపోర్టు చేయాలని సూచించింది. తాజా నివేదికల ప్రకారం.. భారత జెండా ఉన్న నౌకలను బంధించినట్లు ఎటువంటి సమాచారం రాలేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు పెరుగుతున్నందున పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకొన్న భారతీయ నావికులకు తక్షణ సాయం అందించడానికి.. వారిని భారత్‌కు తరలించడానికి ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యుద్ధం వల్ల ప్రభావితులైన భారత నావికులతో ఈ బృందంలోని అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతారన్నారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ కంపెనీలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, సంబంధిత పోర్ట్ అధికారులతోనూ ఈ బృందం సమన్వయం చేసుకుంటుందన్నారు.

## దివ్యాంగుల నిరామయ

### ఆరోగ్య భీమా పథకంను సద్వినియోగం చేసుకోండి.



**బేతంచర్ల మార్చి 3 (బేతంచెర్ల మార్చి 3 ( నందిపత్రిక).)** బేతంచెర్ల మండలము గ్రామీణ ప్రాంతాలలో నివాసముంటున్న దివ్యాంగులు పెన్షన్ పొందుతున్న దివ్యాంగులు నిరామయ ఆరోగ్య బీమా పథకం దరఖాస్తు చేసుకోవాలని, స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి రాముడు తెలిపారు. స్థానిక దివ్యాంగుల కార్యాలయంలో దివ్యాంగులతో సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షులు పీట్ల మద్దిలేటి మాట్లాడుతూ అర్జీజం,మెంటల్, సెరభీల్ పాలసీ, మల్టిపుల్, డిజిబిలేటి వారు అర్హులు కావాల్సిన పత్రాలు వికలాంగుల సదరం సర్టిఫికెట్,ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయం, కులం ధ్రువీకరణ పత్రం తీసుకొని నిరామయ ఆరోగ్య భీమా పథకం లక్ష రూపాయలు దివ్యాంగులకు ఈ బీమా వర్తిస్తుంది. లేదా జిల్లా సంక్షేమ కార్యాలయం గానీ దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం గానీ వెల్ఫేర్ కార్యాలయం గానీ దరఖాస్తు ఇచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో లచ్చమ్మ, మద్దమ్మ, శకుంతల, సురేష్, రామమోహన్, శశిధర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదకు ఇంటి స్థలం ఇస్తాం. మంత్రి బీసి

### బనగానపల్లె పల్లె అవుకు మెట్టవద్ద ఇళ్ల స్థలలాను పరిశీలించిన మంత్రి



**బనగానపల్లె మార్చి 3నందిపత్రిక** బనగానపల్లె అవుకు మెట్ట వద్ద పేదలు గూడు నిర్మించుకొనేందుకు అవసరమైన ఇంటి స్థలాలను రాష్ట్ర మంత్రి బీసి జనార్దనరెడ్డి మంగళవారం రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను బనగానపల్లె ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 3200 నుండి 3500 మందికి ఇల్లస్థలం ఇస్తామని అందులో వారు ఇళ్ళు నిర్మించుకోవాలని అన్నారు.అయితే ఈ భూములు దేవాదాయ శాఖ పరిధిలో ఉండడంతో కొంత ఆలస్యమైందని ఈ భూములకు ప్రత్యామ్నాయ భూములు చూసిన వెంటనే ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. కార్యక్రమం లో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆర్డీవో నరేంద్రనాథ్ రెడ్డి,తహసీల్దార్ నారాయణరెడ్డి మంత్రి వెంట ఉన్నారు.



## శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవ శోభాయాత్ర



**కర్నూలు ప్రతినిధి. మార్చి 03 . (నంది పత్రిక ):**కర్నూలు నగరంలో పూజ్యపాద కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న 89వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం సందర్భంగా, శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవ శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు యాగ కమిటీ సభ్యులు వాసు దేవయ్య, సాయిరాంలు తెలిపారు. వినాయక ఘాటు నుండి యాగశాల వరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు ఈ మహోత్సవ శోభాయాత్ర ప్రారంభమవుతుందని, ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని ధార్మిక సంఘాలు, కుల సంఘాలు, హిందూ సంఘాలు సమష్టిగా పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయగలరని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు తూముకుంట ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. ఈ శోభాయాత్రలో భజనలు, నామసంకీర్తనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి కార్యక్రమాలతో ఈ యాత్ర సాగుతుందని తలిపారు. ఈ ధర్మ పరిరక్షణకై సాగుతున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై శ్రీ సీతారాముల పట్టాభిషేక శోభాయాత్రలో భక్తులు వేలాదిగా పాల్గొని శ్రీ సీతారాముల ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు శివకోటి చంద్రశేఖర్, శ్రీధర్, రామిరెడ్డి, సుబ్రమణ్యం, రాఘవేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు, నారాయణ, జనార్దన్ రెడ్డి, నరసింహారెడ్డి, నాగోజీరావు, డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శివ సాయినాథ్,మురళితో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దిలీప్ హత్య ఘటనపై టీడీపీ నేత రితేష్ రెడ్డి భరోసా, ఆర్థిక సహాయం

### దర్యాప్తు వేగవంతం చేయాలని డిమాండ్

**కాశినాయన మార్చి 3(నంది పత్రిక ):**గంగనపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దిలీప్ అత్యంత కిరాతకంగా హత్యకు గురైన ఘటనపై బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ కే. రితేష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నేడు కాశి నాయన మండలం గంగనపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పుట్టెడు దుఃఖంలో ఉన్న దిలీప్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ( ఎస్ బి వి ఆర్) ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.25,000 ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం తరపున కూడా బాధిత కుటుంబానికి తగిన న్యాయం మరియు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్నతో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు.



# జడ్జి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జిల్లా కోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన... కర్నూల్ ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ,



## కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ .

కర్నూలు నంది పత్రిక.... జిల్లా కేంద్రంలోని కోర్టులతో పాటు , జిల్లాలోని అన్ని కోర్టు ఆవరణాల్లో పోలీసు అధికారులు భద్రత ఏర్పాట్లను పరిశీలించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాలతో కోర్టు ప్రాంగణాలలో భద్రత పరంగా సిసి కెమెరాల ఏర్పాటు, పర్మనెంట్ సెక్యూరిటి యూనిట్లు, సెక్యూరిటి రూమ్స్ , గస్తీ విధులు , ప్రవేశ , నిష్క్రమణ గేట్ లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాట్ల పై పోలీసు అధికారులు ఆరా తీశారు.ఈ సంధర్భంగా మంగళవారం ఫోక్సో జడ్జీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో కర్నూలు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ , కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ , హోంగార్డు డిఎస్పీ ప్రసాద్ స్వయంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.భద్రతా పరంగా కోర్టు ప్రాంగణంలోని నిఘా వ్యవస్థ , సీసీ కెమెరాల పని తీరును , ప్రవేశనిష్క్రమణ మార్గాలను , పార్కింగ్ ప్రదేశాల వంటి అంశాలను సమీక్షించారు.కోర్టు విచారణకు హాజరయ్యే ఖైదీల భద్రత ఏర్పాట్ల పై అవసరమైన సూచనలు తెలియజేశారు.కోర్టు ప్రాంగణంలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ఎఓ సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, కోర్టుమానిటరింగ్ సిఐ రామయ్యానాయుడు, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ ఉన్నారు.



# శ్రీశైలం దేవస్థానంలో చంద్రగ్రహణం కారణంగా ఆలయద్వారాలు మూసివేత





**చంద్రగ్రహణం కారణంగా ఉదయం గం. 6.00ల నుండి ఆలయద్వారాలు మూసివేత.**

**రాత్రి గం. 7.30లకు ఆలయద్వారాలు తెరచి ఆలయశుద్ధి, సంప్రోక్షణ, పూజాదికాలు**

**రాత్రి గం. 9.00లకు**

**శ్రీస్వామిఅమ్మవార్లకు మహామంగళహారతులు**

శ్రీశైలం మార్చి 03 (నంది పత్రిక) చంద్రగ్రహణం కారణంగా ఉదయం గం. 6.00ల నుండి ఆలయద్వారాలు మూసివేయబడ్డాయి. తిరిగి రాత్రి గం. 7.30లకు ఆలయ ద్వారాలను తెరచి ఆలయశుద్ధి, మంగళ వాయిద్యాలు, సుసాంధ్యం, సంప్రోక్షణ, పూజాదికార్యక్రమాలు నిర్వహించి రాత్రి గం.9.00లకు శ్రీ స్వామిఅమ్మవార్ల మహామంగళ హారతులు జరిపించబడుతాయి. అవకాశం మేరకు మహామంగళహారతుల సమయం నుంచే అనగా రాత్రి గం.9.00ల నుండి రాత్రి గం. 10.00ల వరకు భక్తులకు శ్రీ స్వామివారి అలంకార దర్శనం, శ్రీఅమ్మవారి దర్శనం కల్పించబడుతాయి.కాగా ఈ రోజు ఉదయం గం. 3.00లకు ఆలయద్వారాలు తెరచి మంగవాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాత: కాలపూజలు,

మహామంగళహారతులు జరిపించబడ్డాయి. మహామంగళ హారతులు సమయం నుంచే అనగా గం. 4. 30ల నుంచి గం. 5.30 గంటల వరకు మాత్రమే భక్తులకు శ్రీస్వామివారి అలంకార దర్శనం, అమ్మవారి దర్శనం కల్పించబడింది. గ్రహణం కారణంగా ఆలయప్రాంగణంలోని పరివార ఆలయ ద్వారాలు మరియు సాక్షిగణపతి, హాటకేశ్వరం ఫాలధార పంచధార మరియు శిఖరేశ్వరం మొదలైన ఉపాలయాల ద్వారాలు కూడా మూసివేయబడ్డాయి. గ్రహణం కారణంగా ఈ రోజు అన్నప్రసాదవితరణ కూడా నిలుపుదల చేయబడింది.





# వెంకటాపురంలో జాతర సందర్భంగా ముస్కాన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు.

ములుగు జిల్లా బ్యూరో మార్చి 03 ( నంది పత్రిక) ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో వేంచేసి ఉన్న, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవాల సందర్భంగా జరిగే జాతరకు, తరలివచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని, ఆనంధాన్ని కుటుంబం తో సహా పొందే విధంగా స్థానిక శివాలయం వీధిలో ముస్కాన్ అనే ప్రైవేట్ సంస్థ,భారీ ఎత్తున జెయింట్ వీల్, చిల్డ్రన్స్ ఐటమ్ , కొలంబస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శ్రీ పద్మావతి శ్రీ అలివేలు మంగ శ్రీ వెంకటేశ్వర స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 28వ తేదీ నా అధ్యయనోత్సవంతో ప్రారంభమయ్యాయి. ఈనెల మార్చి 9వ తేదీ వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ముస్కాన్ సంస్థ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే ఈనెల నాలుగో తేదీ బుధవారం జరిగే స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం సందర్భంగా తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. బుధవారం ఉదయం నుండి ఎగ్జిబిషన్ జెయింట్ వీల్, కార్యక్రమం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముస్కాన్ ఎగ్జిబిషన్ జెయింట్ వీల్, చిల్డ్రన్స్ ఐటమ్ తదితరాలను సుమారు ఎకరం పైగా విస్తీర్ణంలో ఏర్పాటు చేయడంతో, పలు వురు ఆసక్తిగా తిలకిస్తూ, బుధవారం ప్రారంభోత్సవంలో పాల్గొని, ఎంజాయ్ చేస్తామని తెలిపారు. అందరికి అందుబాటు బాటులో ఉండే విధంగా, టికెట్ చార్జిని వసూలు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



# ములుగు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

## గుంటోజు పావని కౌన్సిలర్

ములుగు జిల్లా బ్యూరో , మార్చి 3:( నంది పత్రిక ) ములుగు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ గుంటోజు పావని తన సేవలు, వార్డు అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. స్వయంకృషితో ములుగు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్గా ఎదిగిన యువ నాయకురాలైన గుంటోజు పావని, పదవి కొరకే కాకుండా పార్టీ అభివృద్ధి, ప్రజాసేవనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ములుగు మండల మహిళా అధ్యక్షురాలిగా కూడా తన వంతు సేవలు అందిస్తున్నానని, 4వ వార్డు ప్రజల విశ్వాసం, అభిమానంతోనే గెలుపు సాధించానని పేర్కొన్నారు.మంత్రి సీతక్క అభివృద్ధి మార్గదర్శకత్వంలో నడుస్తూ, ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నానని ఆమె చెప్పారు. “వార్డులో గల్లీ గల్లీ పర్యటించి ప్రజల సమస్యలు వింటూ, వాటికి త్వరగా పరిష్కారాలు చేకూర్చడమే నా ముఖ్య బాధ్యత. రోడ్లు, నీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యలకు శ్రీకారం చేస్తున్నాను. 4వ వార్డు అభివృద్ధి కోసం అంధారీకరణ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు వేగంగా జరుగుతున్నాయి“ అని వివరించారు.ఇటీవల వార్డులో జరిగిన కొత్త రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. “ప్రజల సంక్షేమం కోసం రాత్రి పగలు కృషి చేస్తాను. మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్న మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి పథకాలు 4వ వార్డు ప్రజలకు మేలు జరుగుతుంది “ అని ఆమె ఆత్మవిశ్వాసంగా పేర్కొన్నారు. ములుగు మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. గుంటోజు పావని సేవలు వార్డు ప్రజల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తాయని అందరూ అభినందించారు.



# కేతుగ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మహానంది ఆలయం మూసివేత

## సంప్రోక్షణ,శుద్ధి కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతి





మహానంది మార్చి 03 (నంది పత్రిక):- కేతుగ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం మహానంది ఆలయం తలుపులు దేవస్థానం అధికారులు మూసివేశారు.ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పండితులు,అర్చకులు శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆలయ ద్వారాలు మూసివేశారు.గ్రహణానంతరం రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు తెరిచి ఆలయమంతా కడిగి సంప్రోక్షణ,శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకార్చనల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.



# హక్కుల సాధనకై 4 న అమరావతిలో గళం విప్పనున్న జర్నలిస్టులు.

## చలో విజయవాడకు అనూహ్య స్పందన.



శిరివెళ్ల :-(నంది పత్రిక) జర్నలిస్టుల హక్కుల సాధనకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏ పీ డబ్ల్యూ జే ఎఫ్ ఇచ్చిన పిలుపుమేరకు ఆళ్లగడ్డ తాలూకా ప్రధాన కార్యదర్శి చల్లేపల్లి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమానికి అనూహ్యస్పందన లభించింది. స్థానిక జర్నలిస్టులను కాకుండా ఇతర మండలాల నుండి సైతం జర్నలిస్టులు తరలిరావడంతో అదనపు వాహనాలను ఏర్పాటు చేసి అమరావతికి తరలించారు. జర్నలిస్టులు అధికంగా తరలి రావడం వల్ల సల్లెపల్లె మల్లికార్జున రెడ్డి అదనపు వాహనాలను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని సభ్యులు పేర్కొన్నారు.

# వెంకటాపురంలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం.

## అటవీ శాఖ అధికారుల భారి ర్యాలీ.



ములుగు జిల్లా బ్యూరో మార్చి 03( నంది పత్రిక ) ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా, ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులను కాపాడండి, వాటికి ఎటువంటి హాని కలిగించవద్దు అంటూ ఫ్లెక్సీలు చేత భూని వెంకటాపురం పట్టణ పురవీధులలోభారి ర్యాలీ నిర్వహించారు. వెంకటాపురం ఎఫ్ డి ఓ గ్వాలియా, వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుద్దపల్లి వంశీకృష్ణ,, వాజేడు దూల పురం ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎఫ్డిఓ పరిధిలోని వాజేడు, దూలాపురం, వెంకటాపురం ఫారెస్ట్ సిబ్బంది, అధికారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

# బస్సులో అకస్మాత్తుగా మంటలు పూర్తిగా కాలిపోయిన బస్సు..తప్పిన ముప్పు

విశాఖ నగరంలోని రుషికొండ బీచ్ రోడ్డులో మంగళవారం ఉదయం భారీ ప్రమాదం తప్పింది. ఓ ప్రైవేటు బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలు అంటుకోగానే డ్రైవర్ చాకచక్యంగా బస్సులో నుంచి దూకి తప్పించుకున్నాడు. నగరంలోని గవర్నర్ బంగ్లా ప్రాంతం నుంచి భీమిలిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లేందుకు ఉదయం 6 గంటల సమయంలో బస్సు బయలుదేరింది. రుషికొండ సమీపంలోకి రాగానే ఇంజిన్ భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ రాజేష్, వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగిపోయారు. చూస్తుండగానే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించాయి.

# ములుగు జిల్లా ఇంచర్ల గ్రామ రైతుల ఆవేదన

# ఎర్రి గట్టమ్మ భూములపై అనిశ్చితి




**ఆయిల్ ఫామ్ కంపెనీ నిర్మాణం పై స్పష్టమైన గడువు ప్రకటించాలి.**
**హామీ ఇచ్చిన 20 గుంటల భూమి వివరాలు వెంటనే ఆన్లైన్‌లో నమోదు చేయాలి.**
**కంపెనీ నిర్మాణం జరగనట్లయితే తమ భూములను తిరిగి అప్పగించాలి.**
**తమ భూములను ఇతరులకు పంచిపెట్టే ప్రయత్నం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.**

ములుగు జిల్లా బ్యూరో, మార్చి 03( నంది పత్రిక తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాకు చెందిన ఇంచర్ల గ్రామ రెవెన్యూ పరిధిలో ఎర్రి గట్టమ్మ వద్ద ఉన్న సర్వే నెంబర్లు 28, 29లో గల 12 ఎకరాల భూమి విషయంలో పదిమంది రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల వివరాల ప్రకారం, గత 25 సంవత్సరాలుగా వారు తీవ్ర కష్టనష్టాలకు గురై, అడవిలా ఉన్న భూమిని చదును చేసి సాగులోకి తీసుకువచ్చారు. పుట్టలు, రాళ్లు, పొదలు తొలగించి, పాములుతేళ్లను ఎదుర్కొంటూ శ్రమించి ఈ భూమిని పంటల కోసం అనువుగా మార్చుకున్నామని వారు తెలిపారు. 2004 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి వై. ఎస్. రాజశేఖర రెడ్డి నాయకత్వంలో ములుగు ఎమ్మెల్యే పోదెం వీరయ్య ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో పట్టాలు పంపిణీ చేసినట్లు రైతులు పేర్కొన్నారు. అప్పటి నుండి ప్రభుత్వ రైతు పథకాలైన రైతు బంధు మరియు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాల లబ్ధి పొందుతున్నామని తెలిపారు. బ్యాంకు క్రాప్ లోన్లు కూడా పొందుతున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై నమ్మకంతో తమ కుటుంబాల ఆడబిడ్డలకు పసుపు కుంకుమల కింద భూమిని రాసి ఇచ్చామని రైతులు తెలిపారు. తాము ఎలాంటి లంచాలు ఇవ్వకుండా చట్టబద్ధంగా భూమి పొందినవారమని, తమతో పాటు పట్టాలు పొందిన ఇతరులు తమ భూములు వదిలి తమ భూములపై కన్నేశారని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎర్రి గట్టమ్మ వద్ద ఆయిల్ ఫామ్ కంపెనీ నిర్మిస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనను మంత్రి సీతక్క , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో చేసినట్లు రైతులు తెలిపారు. అయితే ఇప్పటివరకు బడ్జెట్ విడుదల చేయకపోయినా శిలాఫలకం ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. భూమి నిర్వాసితులకు 20 గుంటల భూమి మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారని, పంచాయతీ ఎన్నికల ముందు 20 గుంటల ప్రొసీడింగ్ కాపీలు అందజేశారని రైతులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ వివరాలు ఆన్లైన్‌లో నమోదు కాలేదని, దీంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆగ్రహంతో కొందరు రైతులు భూముల్లో ఏర్పాటు చేసిన స్తంభాలు తొలగించినట్లు సమాచారం. ఇదే సమయంలో మేడారం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గుడి ప్రాంగణంలోని వ్యాపారుల గుడారాలు తొలగించడంతో స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ లబ్ధిదారులకు ఎర్రి గట్టమ్మ వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రైతుల్లో మరింత అనుమానం పెరిగిందని వారు అంటున్నారు. ములుగు జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆయిల్ ఫామ్ కంపెనీ పై స్పష్టత ఇవ్వాలని, రైతుల జీవనోపాధి మరియు హక్కులను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# అడవులను రక్షించాలి

**వన్యప్రాణులను కాపాడుకోవాలి**

**ఫారెస్ట్ అధికారుల బైక్ ర్యాలీ**



ములుగు జిల్లా, బ్యూరో, మార్చి 3 ( నంది పత్రిక ) ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏటూరునాగారం బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, అడవుల సంరక్షణ మరియు వన్యప్రాణుల రక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన ఔషధ మొక్కలు మానవాళికి అమూల్యమైన సంపదగా భావిస్తూ, వాటిని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు, వన్యప్రాణుల వేట, అడవుల నరికివేత వంటి అక్రమ చర్యలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భవిష్యత్ తరాలకు అడవులు, వన్యప్రాణులు, ఔషధ వనరులు అందుబాటులో ఉండేలా సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ప్రాద్బలంతో అటవీశాఖ అధికారులు వీరంగం

**పాడు రైతులను ఇబ్బంది పెడితే తిరుగుబాటు తప్పదు**

**బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి**



ములుగు జిల్లా బ్యూరో మార్చి 3 ( నంది పత్రిక ) ప్రభుత్వ అండతో అటవీశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పట్టాలున్నా గిరిజన పోడు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలో గిరిజన పోడు రైతులు ఎన్నో ఏళ్ళుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూముల్లో అటవీశాఖ అధికారులు కందకాలు తీయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు, ప్రజాపాలనని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల పోడు భూములపై ఫారెస్ట్ అధికారులతో దౌర్జన్యం చేపించడం సిగ్గుచేటు అని అన్నారు , స్థానిక మంత్రి కి ఇంత జరుగుతుంటే కనపడటం లేదా అని ప్రశ్నించారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ గిరిజన రైతులకు పోడు పట్టాలిచ్చి గిరిజన రైతులకు న్యాయం చేశారని అన్నారు,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములను గిరిజనుల నుండి ఫారెస్ట్ అధికారులతో లాక్కోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు, ఆదివాసీలను అటవీశాఖ అధికారులు, ఇబ్బంది గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని మాటలు చెప్పిన మంత్రి సీతక్క , ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని,ఇప్పుడు గిరిజనులు కనపడడం లేదా అని దుయ్యబట్టారు,పోడు రైతులకు అండగా ఉంటామని గిరిజన రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు

# కాల్వపల్లి గ్రామంలో ఉద్రిక్తత..




**ఫారెస్ట్ జెసిబి ని అడ్డుకున్న పోడు రైతులు**

ములుగు జిల్లా బ్యూరో మార్చి 03( నంది పత్రిక ) ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో మంగళవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు 25 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల చుట్టూ అటవీ శాఖ అధికారులు జేసీబీ యంత్రాలతో కందకాలు తవ్వే ప్రయత్నం చేయడంతో వివాదం ప్రారంభమైంది. విషయం తెలిసిన గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. తమ జీవనాధారమైన పోడు భూములను ఆక్రమణ పేరుతో తీసివేయడం అన్యాయమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు గ్రామస్థులు జేసీబీపైకి ఎక్కి పనులను నిలిపివేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామస్థుల వాదన ప్రకారం, దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములపై ముందస్తు సమాచారం లేకుండా చర్యలు తీసుకోవడం సరైంది కాదని, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అటవీ భూముల పరిరక్షణ పేరుతో జీవనోపాధిని దెబ్బతీయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, పెద్ద ఎత్తున ఘర్షణలు జరగకుండా స్థానిక అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ములుగు ఎస్పీ క్యాంప్ ఆఫీసులో ఘనంగా హోలీ సంబరాలు




ములుగు జిల్లా బ్యూరో మార్చి 3 ( నంది పత్రిక) ములుగు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుధీర్ రామనాద్ కేకన్ ఆధ్వర్యంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హోలీ, సంబరాలు ఘనంగా జరిగాయి. డీజే సౌండ్ పాటలతో ఎస్పీగారు అదిరిపోయే స్టెప్పులు వేసి సంబరాలకు నేతృత్వం వహించారు. పోలీస్ సిబ్బందితో కలిసి రంగులు పూసుకుని, స్వీట్లు పంచుకుని ఉత్సవ వాతావరణాన్ని సృష్టించారు. మహిళా పోలీస్ సిబ్బంది కూడా డ్యాన్స్ చేసి సంబరాలను మరింత రంగుల రాజ్యంగా మార్చారు.ఈ సందర్భంగా ఎస్పీ రామనాద్ కేకన్ ములుగు జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి హోలీ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంబరాలు సిబ్బంది మధ్య బాంధవ్యాన్ని మరింత బలపరిచాయని, ప్రజలతో సమీపంగా ఉండే వాతావరణాన్ని పెంపొందించాయని ఎస్పీ తెలిపారు.

# మహిళ మృతికి కారకులైన నిందితులకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**పేరూరు పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మరియు కోర్ట్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్,ఐ పి ఎస్**



ములుగు జిల్లా బ్యూరో మార్చి 03( నంది పత్రిక )చెరపల్లి గ్రామం, మంగపేట మండలానికి చెందిన ఫిర్యాదుదారు కుకట్ల రాజమ్మ ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో మృతురాలు కాటా రాణి మృతికి సంబంధించి విచారణ జరిగింది. క్రైం నం.19/2017, సెక్షన్ 304(బి ) ఐపీసీ , పేరూరు పోలీస్ స్టేషన్ సంబంధిత కేసులో న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది.

ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఆమె భర్త

(ఏ 1) కాటా మహేష్ మరియు

(ఏ 2) కాటా కన్న (భార్య: చిన్న నర్సయ్య) ను గౌరవ న్యాయమూర్తి శ్రీమతి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ (స్పెషల్ జడ్జి ఫర్ ్రూజూరా కోర్టు కమ్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, ములుగు) ఈ తీర్పును వెలువరిస్తూ ఇద్దరు దోషులుగా తేలినట్లు పేర్కొంది.కాగా ఇద్దరు నిందితులకు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడమే కాకుండా, ఒక్కరికి రూ.5,000/- జరిమానా విధించబడింది.లి ఈ కేసును సమగ్రంగా పరిశోధించి పటిష్టమైన సాక్ష్యాధారాలతో కోర్టులో సమర్పించిన దర్యాప్తు అధికారూలైన శ్రీ రాహుల్ హెగ్డే, ఐపీఎస్ , ప్రస్తుత ఏటూరునాగారం ఏ ఎస్ పి శ్రీ మనన్ భట్,ఐపీఎస్ , సీఐ ఎం. రమేష్ , ఎస్ హెచ్ ఓ శ్రీ కె. కృష్ణ ప్రసాద్ ఎస్సై, కోర్టు మానిటరింగ్ అధికారి శ్రీ కిషోర్ డీఎస్పీ, కోర్టు లియాజనింగ్ అధికారి శ్రీ లక్ష్మణ్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ డి. రామ్ సింగ్, సీడీఓ శ్రీ జి. నాగరాజు పీసీ మరియు సంబంధిత సిబ్బందికి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ఐపిఎస్ అభినందనలు తెలియజేశారు.అలాగే ఈ తీర్పు ద్వారా మహిళలపై జరిగే అఘాయిత్యాలకు కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టమైందని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు శాఖ నేరాల నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

# మట్టిని తవ్వేయి.. ఇసుకను చేసేయ్ చోద్యం చూస్తున్న అధికారులు

వెల్దండ మార్చి 03: వాగుల్లో సాధారణ ఇసుక దొరకడం కరువైంది. నిత్యం వాగుల్లోంచి ఇసుకను తోడేసి మాఫియా అక్రమ రవాణాకు పాల్పడుతోంది. దీంతో నాణ్యమైన ఇసుక దొరకడం కష్టతరమైంది. మండల పరిధిలోని బొల్లంపల్లి కొత్త చెరువులో కొంతమంది ఇసుక వ్యాపారులు చెరువులో క్వారీలు చేసి మట్టిని తవ్వి మట్టిపై నీటిని పడితే మట్టి కొట్టుకుపోయి ఇసుక మిగులుతుంది. మండలంలోని 80 శాతం వ్యవసాయ పొలాల్లో, చెరువుల్లో మట్టిని ఫిల్టర్ చేస్తూ ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఫిల్టర్ ఇసుక రవాణా జోరుగా సాగుతున్న అధికారులకు పట్టని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ఎక్కువగా, పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ప్రకృతిని దోచుకుంటున్నా.. అధికారులు పట్టి పట్టనట్లు ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను, ఒక ఫిల్టర్ ను అరికట్టాలని కోరుతున్నాను.

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్ రైడ్ సరదా

**స్నేహితుడితో కలసి రైడ్ చేస్తుండగా ప్రమాదం**

స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు. విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్ ను అ÷-దదెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లాగూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హార్ముజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !

పిల్లికి చెలగాలటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా,అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్ముజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్ల చమురు హార్మూజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్‌జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్మూజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహాల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది. ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం,

హార్మూజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్మూజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుంద నుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

# తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

### అమెరికా నెత్తిన భారీగా భారం పడడం ఖాయం

### ఇప్పటికే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే.

ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట. అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియా లో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత అన్న భయాలు కలుగుతున్నాయి. ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బ్జడెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం.

# ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

### ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించినట్లు ప్రచారం కమేనీ కదలికలను గుర్తించి..పక్కాగా బాంబింగ్

ఆధునిక యుద్ధవిద్యలో ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం సాధించాయని విదేవీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టా÷-గ్గ÷ట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని

ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

## హార్ముజ్ జలసంధి మూసివేత

పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే ముడిచమురు ధరలు పెరుగుతుండగా.. ఇరాన్ ఇచ్చిన వార్నింగ్ మరింత ఆందోళనకు దారితీస్తోంది. హోర్ముజ్ జలసంధి ని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి ప్రయత్నిస్తే నిప్పు పెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపైనైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. హోర్ముజ్.. ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయం అయినా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజ లాడిస్తుంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇంతటి కీలకమైన జలసంధి మూసుకుపోతే.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటికే ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు భగ్గుమంటు న్నాయి. కాగా.. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో తమ సుప్రీంనేత ఖమేనీ మృతి చెందడంతో ఇరాన్

రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే హోర్ముజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. సుమారు 150 ఆయిల్ ట్యాంకర్లు ఇప్పటికే ఈ హోర్ముజ్ నుంచి వెళ్లేందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు హోర్ముజ్ తూర్పువైపున 60 ట్యాంకర్లు వేచిచూస్తున్నాయి. ఇదిలాఉంటే, ఫిబ్రవరి మధ్యలో సైనిక విన్యాసాల కోసం జలసంధిలో కొంతభాగాన్ని ఇరాన్ మూసివేయగా.. అప్పుడు చమురు ధరలు 6 శాతం మేర పెరిగాయి.

# విరుచుకు పడుతున్న ఇరాన్

## బహ్రాయిన్‌లో యూఎస్ ఎయిర్‌బేస్ ధ్వంసం

పశ్చిమాసియాలో తాజా ఘర్షణలు నాలుగో రోజుకు చేరాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ప్రాంతంలోని అమెరికా ఎయిర్‌బెస్‌ను ధ్వంసం చేశామని మంగళవారం ఇరాన్ ప్రకటించుకుంది. డ్రోన్లు, క్షిపణులతో కమాండ్ సెంటర్, కేంద్ర కార్యాలయాన్ని దెబ్బతీశామని వెల్లడించింది. 20 డ్రోన్లు, మూడు క్షిపణులతో టా÷-గ్గ÷ట్లను ఢీకొట్టాం. దాంతో ఆ ప్రాంతంలో ఇంధనాన్ని నిల్వ చేసే ట్యాంకులకు మంటలు అంటుకొని ఆ ప్రాంతమంతా పొగ అలముకుందని ఇరాన్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని రమాత్ డేవిడ్ ఎయిర్‌బేస్‌పై దాడి జరిగినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. రాడార్ కేంద్రాలు, కంట్రోల్ రూమ్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. అందుకోసం డ్రోన్ల గుంపును పంపినట్లు పేర్కొంది. ఇదిలాఉంటే.. బీరుట్ దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు చేసింది. ఎరుపు రంగు మార్కింగ్‌లో ఉన్న భవనాలు, ఆ పక్కనే ఉన్న ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలి. కనీసం 300 మిటర్లు దూరంగా వెళ్లండి. ఆ భవనాలన్నీ హెజ్‌బొల్లా స్థావరాలకు దగ్గర్లో ఉన్నాయని ఇజ్రాయెల్ పేర్కొంది.

# అమెజాన్ డేటా సంటర్లపై డ్రోన్ దాడి ధృవీకరించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్

అమెరికా- ఇజ్రాయెల్ సైనిక చర్యలకు ప్రతీకారంగా పశ్చిమాసియాపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలో అక్కడి అమెజాన్ డేటా సెంటర్‌లపై డ్రోన్ దాడులు జరిగినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ దాడులు నిజమేనని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ధ్రువీకరించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని తమ రెండు డేటా సెంటర్లను డ్రోన్‌లు నేరుగా ఢీకొట్టాయని అమెజాన్ పేర్కొంది. దీంతో పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ సర్వీసుల్లో అంతరాయం కలిగినట్లు తెలిపింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్ సమీపంలో జరిగిన దాడి వల్ల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో ఉద్యోగులు ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనే విషయం గురించి సంస్థ స్పష్టం చేయలేదు. సర్వీసుల పునరుద్ధరణకు తమ సిబ్బంది స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పింది. సర్వీసుల్లో అంతరాయం కారణంగా ప్రభావితమైన వినియోగదారులు కీలకమైన డేటాను బ్యాకప్ చేసుకొని.. ఇతర ప్రాంతాల్లోని అమెజాన్ సర్వీసులకు మారాలని సూచించింది.

# క్షేమంగా ఇండియా చేరుకున్న పివి సింధు బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన షట్లర్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు. ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

## వడదెబ్బకు ముందే అప్రమత్తత అవసరం

## గ్రామాల్లో మంచినీరు, పశుగ్రాసం ప్రణాళికలు ముఖ్యం

వేసవి రాకముందే రాష్ట్రంలో ఎండలు మండుతున్న తీరు చర్చనీయాంశం గా మారింది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో 35 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం నాడు పలు రాయలసీమ జిల్లాలతో పాటు, కోస్తా జిల్లాల్లో కూడా 35 నుండి 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసినప్పటికీ అత్యధిక జిల్లాల్లో సూర్య ప్రతాపమే కొనసాగింది. వాతావరణ శాఖ జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ ఏడాది మార్చి నెలలో వేసవి కాలం ప్రారంభమై మే నెలాఖరు వరకు కొనసాగాల్సి ఉండగా ఫిబ్రవరి నెలలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకరం. కొన్ని సంవత్సరాలు గా దేశవ్యాప్తంగా వాతావరణంలో ఈ తరహా మార్పులు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం భారతదేశ చరిత్రలో అత్యంత వేడి నమోదైన సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. ఆ సంవత్సరం మన రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత సుమారు 1 నుండి 1.5 డిగ్రీల వరకు అధికంగా నమోదైనట్లు వాతావరణ విభాగ విశ్లేషణలు చెబుతున్నాయి. గత ఏడాది అనంతపురం, కర్నూలు, నంద్యాల, గుంటూరు జిల్లాలో 45 నుండి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, మార్చి నెల మధ్యలోనో, ఏప్రిల్ ప్రారంభం నుండో మండే ఎండలు ఈ సారి ఫిబ్రవరిలోనే ప్రారంభం కావడం ముందస్తు హెచ్చరికగా భావించక తప్పదు. ఒక అధ్యయనం ప్రకారం 2010 తరువాత ప్రతి ఐదు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. వడ గాలుల తీవ్రత, అవి కొనసాగే కాలవ్యవధి పెరుగుతోంది. ఆ క్రమంలోనే 2024 వేసవిలో దేశవ్యాప్తంగా వడదెబ్బ కేసులు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాల ప్రకారం, దేశ వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా వందల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. మన రాష్ట్రంలో కూడా గత వేసవిలో వడదెబ్బ కారణంగా రెండు డజన్లకు పైగా మరణాలు నమోదైనట్లు సమాచారం. ఇటువంటి ఉత్పాతాలు కేవలం వైద్య, ఆరోగ్య పరమైన అంశాలనే కాదు. సామాజిక అసమానతల్ని కూడా బట్టబయలు చేస్తాయి. నిర్మాణరంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికులు, రోడ్లపై చిన్నా చితక పనులు చేస్తూ పొట్ట పోసుకునే కష్టజీవులే వడదెబ్బ, వేడి గాలుల బాధితుల్లో అధిక సంఖ్యలో ఉండటం ఈ వాస్తవాన్నే విదితం చేస్తోంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకోవడమన్నది ఏటా చూస్తూనే ఉన్నాం. దీనిని అర్థం చేసుకోవడం నివారణ చర్యలు తీసుకోవడం ఇప్పుడు తప్పనిసరిగా మారిన ఒక సామాజిక బాధ్యత. ఉష్ణోగ్రతలు ఏటికేడాది వరుసగా రికార్డులు బద్దలు కొడుతూ, మరణాల సంఖ్య పెరుగుతున్నాయి. పెరిగే ఎండలు ప్రజలకు తాగునీరు, సాగునీటి అవసరాల పైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. భూగర్భజలాలు తీవ్రంగా క్షీణించడం, విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. వీటిని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం తక్షణం వేసవి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. ఈ యాక్షన్ ప్లాన్లు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు అమలయ్యేలా చూడాలి. ముందస్తు హెచ్చరికలు, పనివేళల్లో మార్పులు, తాగునీటిని అందుబాటులో ఉంచడం, గ్రీన్ కవర్ పెంచడం, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతుందన్నది అనేక దేశాల్లో, కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే నిరూపితమైన సత్యం. ప్రభుత్వం ఈ విషయమై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి సంవత్సరం చోటుచేసుకుంటున్న ఈ వైపరీత్యాన్ని నిరక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చని అంటున్నారు.

# వెల్దండలో ఘనంగా హోలీ సంబరాలు

వెల్దండ మండలం వ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పండు ముసలి వరకు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకొని , కొందరు సహజసిద్ధమైన ప్రకృతి రంగు అయినా గోగు పూలతో తయారుచేసిన రంగులను చల్లుకున్నారు. ఈ వేడుకల్లో జంగిలి యాదగిరి, గోరేటి భరత్, మహేందర్, చిన్న ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయస్థానాలను ప్రశ్నించకూడదా?

'సుప్రీంకోర్టు సంస్థాగత ఆధిపత్యాన్ని దిగజార్చేందుకు, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలను అడ్డుకోకపోతే, ప్రజల దృష్టిలో న్యాయవ్యవస్థ పవిత్రత క్షీణిస్తుంది. యువత లేత మనసులపై ప్రభావం చూపుతుంది.. మాపై తుపాకి కాల్చారు.. న్యాయవ్యవస్థ నెత్తురోడుతోంది.' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన 8వ తరగతి పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించినందుకు ఆయన ఏకంగా ఆ పుస్తకాన్నే నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. కనీసం డిజిటల్ రూపేణా కూడా ఈ పుస్తకం కనపడరాదని ఆయన ఆజ్ఞాపించారు. ఈ నిషేధాజ్ఞల తర్వాత కొన్ని లక్షల పుస్తకాలను ఎన్‌సీఈఆర్‌టీ ఉపసంహరించుకుంది. ఈ పాఠ్యపుస్తకం జిరాక్స్ కాపీలను అమ్ముతున్నందుకు ఒక పుస్తకాల షాపు యజమానిని పోలీసులు అరెస్టు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. 'న్యాయవ్యవస్థను అప్రతిష్టపాలు చేసేందుకు ఈ భూమి మీద ఏ ఒక్కరినీ నేను అంగీకరించే ప్రసక్తి లేదు' అని సీజేఐ అన్నారు. ఆ పాఠ్యపుస్తకంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్‌లో ఉన్నారు. న్యాయవ్యవస్థ మనసు గాయపరిచినందుకు మోదీ కూడా బాధపడ్డారు. అసలు ఇవన్నీ ఎవరు చూస్తున్నారు.. అని మోదీ అన్నట్లు అధికార వర్గాలే మీడియాకు వెల్లడించాయి. దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశంలో కూడా మోదీ ఈ విషయం ప్రస్తావించారు. 'మన న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని మనమే 8వ తరగతి పిల్లలకు ఎలా చెబుతాం' అని మోదీ అన్నట్లు వార్తలు వచ్చాయి. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివాదాస్పద అధ్యాయాన్ని 8వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చినందుకు విచారం వ్యక్తం చేశారు. 'న్యాయవ్యవస్థ అంటే మాకెంతో గౌరవం ఉన్నది. ఉద్దేశపూర్వకంగా న్యాయవ్యవస్థను అవమానించాలని మేము అనుకోలేదు' అని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ ప్రొఫెసర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు నోటీసులు పంపింది. భారత ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేసినట్లు ఈ మొత్తం ఉదంతం వెనుక న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే కుట్ర ఉన్నదా? ఒక పద్ధతి ప్రకారం న్యాయవ్యవస్థ పట్ల ప్రజల గౌరవం తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? నిజానికి మోదీ ప్రభుత్వమే ఈ కుట్ర పన్నిందన్న అభిప్రాయం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. 'ఒక దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల్లో తమ సైద్ధాంతిక వైరస్‌ను వ్యాప్తి చేసేందుకు బీజేపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించడం అనేది యాదృచ్ఛికంగా జరగలేదు. కాని ఒక పద్ధతి ప్రకారం విద్యార్థుల మనసులను చెడగొట్టేందుకు ప్రయత్నం జరిగింది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ అన్నారు. మోదీ స్వయంగా ఈ ప్రక్రియకు మార్గదర్శకత్వం వహించారని, ఆర్‌ఎస్‌ఎస్ దీని వెనుక ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయని ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టులో ప్రతిపక్షాల కేసులను వాదించే న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ సింఘ్వి ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ మరింత తీవ్రంగా పట్టించుకునేలా తమ వాదనలు వినిపించారు. ఏదో పెద్ద కుట్ర జరిగిందనే అభిప్రాయం కల్పించడంలో వారు కృతకృత్యులయ్యారు. 'ఈ దేశంలో అభివృద్ధి వేగంగా జరిగేందుకు న్యాయవ్యవస్థే ప్రధాన అడ్డంకి..' అని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ గతంలో అన్నమాటలు కూడా ఇదే సమయంలో ప్రస్తావనకు వచ్చాయి. న్యాయ వ్యవస్థ ద్వారానే తమకు అంతిమంగా న్యాయం జరుగుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉన్నందువల్లే లక్షలాది సంఖ్యలో వారు కోర్టు తలుపుతడుతున్నారు. కోర్టులు తమకు న్యాయం చేస్తాయన్న అభిప్రాయం లేకపోతే, వారు కోర్టులకు వెళ్లకుండా ఆటవిక న్యాయానికి పాల్పడే అవకాశం ఉన్నది. 'ఈ దేశంలో ప్రజలకు న్యాయం లభించదు అన్న అభిప్రాయం విద్యార్థులకు కలిగించలేం..' అన్న జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం సరైనది కాదని అనలేము. మురికివాడల్లో నివసించే పేదలను కూడా దురాక్రమణదారుల్లా ఒక తీర్పులో చెప్పారని ఆ పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. అలా ప్రస్తావించడం ద్వారా మొత్తం న్యాయవ్యవస్థ పేదలకు వ్యతిరేకమని చిత్రించేందుకు ప్రయత్నించడం సరైనది కాదు. 'అన్యాయం ఎక్కడ జరిగినా అంతటా న్యాయానికి ముప్పు వాటిల్లినట్లే' అన్న మార్టిన్ లూథర్ కింగ్ వ్యాఖ్యలను ఉటంకించిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ జితేందర్‌సింగ్ ఇటీవల ఢిల్లీ మద్యం కేసుపై ఇచ్చిన తీర్పులో అధికార పార్టీ ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించేందుకు సీబీఐ ఎలా వాస్తవాలను తనకు అనుగుణంగా మార్చుకుంటుందో దాదాపు 600 పేజీల తీర్పులో వివరించారు. 'ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తీసుకున్న విధాన నిర్ణయాలను కూడా నేరాలుగా భావిస్తే ఇక ఏ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోగలదు?' అని ఆయన ప్రశ్నించారు. కేసులో అప్రూవర్లు, నేరంలో పాలుపంచుకున్న సాక్షుల మాటలనే విశ్వసించి నెలల తరబడి నిందితులను జైళ్లో బంధించడంలోని అన్యాయాన్ని ఆయన ఎత్తిచూపారు. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ రెండూ ప్రభుత్వ దయతో రాలేదని, అవి రాజ్యాంగం ద్వారా వచ్చాయని, రాజ్యాంగానికీ, చట్టాలకూ మధ్య సమతుల్యత పాటించకపోతే నేర న్యాయ విచారణ వ్యవస్థపైనే ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుందని ఆయన అన్నారు. ఢిల్లీ మద్యం కేసుల్లో అనేక సందర్భాల్లో స్టేకు నిరాకరించిన రాజ్యాంగ ధర్మాసనాలు కూడా ఈ స్థాయిల్లో క్రింది కోర్టు మాదిరి ఆలోచించలేకపోవడం గమనార్హం. ఈ తీర్పును పై కోర్టుల్లో ఎంత సవాలు చేసినా ఆ తీర్పు లేవనెత్తిన ప్రశ్నల ప్రాధాన్యత తగ్గే అవకాశాలు లేవు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ప్రస్తావించిన ఒక పాఠ్యపుస్తకాన్ని నిషేధించడం వల్ల విద్యార్థులకు న్యాయవ్యవస్థలో ఏమి జరుగుతుందో క్లాసురూమ్‌లో తెలుసుకునే అవకాశం లేకుండా పోవచ్చు. నిషేధించడం ద్వారా జరిగిన చర్చ వల్ల ఆ విషయంపైకి వారి దృష్టి మరింత మళ్లేందుకు ఆస్కార మేర్పడింది. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల ద్వారానే లోకంలో ఏం జరుగుతుందో తెలుసుకుంటున్నారా? పాఠ్యపుస్తకాల్లో చెప్పనంత మాత్రాన న్యాయవ్యవస్థపై వారికి దురభిప్రాయం కాకుండా ఉన్నతాభిప్రాయం కలిగే అవకాశం ఉన్నదా? ఇవాళ ఏ పాఠ్యపుస్తకమూ చూపనంత ప్రభావాన్ని సోషల్ మీడియా చూపుతుందన్న విషయం తెలియనిది కాదు. 8వ తరగతి పిల్లలు టీవీ చూడరా, పేపర్లు చదవరా? అంతే కాదు, పాఠ్యపుస్తకంలో ప్రస్తావించినట్లుగా సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో కలిపి కోట్లాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం ప్రభుత్వమే పార్లమెంట్‌లో అనేక సందర్భాల్లో వెల్లడించింది. న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన వల్ల ప్రజల విశ్వాసం తగ్గిపోతుందని 2025లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ గవాయ్ అన్న వ్యాఖ్యలను కూడా ఇదే పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. అందువల్ల పాఠ్యపుస్తకాన్ని నిషేధించినంత మాత్రాన ప్రజల దృష్టిలో న్యాయవ్యవస్థపై ప్రజల గౌరవం పెరిగే అవకాశాలు లేవు. పుస్తకంలో చదువుకోనంత మాత్రాన ఆ విషయాలు విద్యార్థులకు తెలియకుండా దాచిపెట్టగలగడం అసాధ్యం. రెండవది, సుప్రీంకోర్టుకు ఒక పుస్తకాన్ని కానీ ప్రసంగాన్ని కానీ నిషేధించే రాజ్యాంగాధికారం ఉన్నదా అన్న విషయమూ చర్చనీయాంశమైంది. ఒక ప్రజాస్వామిక సమాజంలో ఒక పుస్తకాన్ని సెన్సార్ చేయడం అనేది ఆర్టికల్ 19 క్రింద భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం క్రిందకు వస్తుంది. ఆర్టికల్ 19 విషయంలో న్యాయపరమైన తీర్పులు చట్టం క్రిందకు వస్తాయా, రాజ్యాంగం ఈ అధికారం న్యాయవ్యవస్థకు ఇచ్చిందా అన్న విషయంపై న్యాయనిపుణులు చర్చను లేవనెత్తుతున్నారు. తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రజలు కోర్టు తలుపు తట్టవచ్చు. కాని కోర్టులే ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినప్పుడే ఏమి చేయాలి.. అని వారు ప్రశ్నిస్తున్నారు. అసలు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ప్రస్తావించినప్పుడే కోర్టు ఎందుకు ప్రతిస్పందించాలి? మిగతా వ్యవస్థలను ఎంత విమర్శించినా ఎందుకు ఊరుకోవాలి?

పాఠ్యపుస్తకాలు ఈ దేశంలో ఉన్న రుగ్మతల్ని చర్చించడంలో తప్పులేదని, వాటిని చర్చించడం ద్వారానే వాటిని పరిష్కరించుకోవచ్చునని వాదించేవారు ఉన్నారు. ఉదాహరణకు ఎన్నికల వ్యవస్థల్లో అక్రమాల గురించి కూడా పాఠ్యపుస్తకాల్లో చర్చించారు. ఒక అభ్యర్థి కారులో కరెన్సీ నోట్లు దొరికినట్లు చిత్రాన్ని ప్రచురించారు. అలా జరగడం లేదా? ఇప్పటి వరకూ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల గురించి అనేక ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు కూడా దొరికిన దృశ్యం ప్రజల మనసుల్లో చెరిగిపోలేదు. ఏ న్యాయమూర్తికీ అవినీతి ఆరోపణలపై శిక్షపడినట్లు, లేదా అభిశంసించినట్లు దాఖలాలు లేవు. మహా అయితే బదిలీలు జరిగాయి. సాధారణ ప్రజలు, రాజకీయ నేతలు సీబీఐ దాడులు, ఈడీ దర్యాప్తులు ఎదుర్కొంటున్నప్పుడు న్యాయమూర్తులపై మాత్రం అలా ఎందుకు జరగదు? 8వ తరగతి పుస్తకాన్ని నిషేధించిన ఉన్నత న్యాయస్థానమే ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి.

# మళ్లీ ట్రెండ్‌లోకి ఫ్రాయిడ్!

దశాబ్దాలుగా ఫ్రాయిడ్ కాలం చెల్లిన వ్యక్తిగా పరిగణించబడ్డారు. "కాకికేమి తెలుసు సైకో ఎనాలసిస్సు?" అని శ్రీశ్రీ అన్నట్టు విమర్శకులు అనేకులు కాకుల్లా ఫ్రాయిడ్ ఆలోచనలపైన దాడి చేశారు. ఫ్రాయిడ్ చెప్పిన మనోవిశ్లేషణ విధానం (సైకో ఎనాలసిస్) అశాస్త్రీయమని తోసిపుచ్చారు. మరికొందరు ఆయన ఆలోచనలు లింగవివక్షతో కూడుకున్నవని, ఆధునిక జీవితానికి సంబంధం లేనివని కొట్టిపారేశారు. కానీ ఇప్పుడు, ఆందోళన, రాజకీయ ఉద్రిక్తతలు, మానసిక అలసటతో నిండిన ప్రపంచంలో, ప్రజలు ఫ్రాయిడ్‌ను మళ్లీ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ పునరుజ్జీవనానికి కొంతవరకు పాపులర్ కల్చర్ కారణం. 'కపుల్స్ థెరపీ' అనే టెలివిజన్ సిరీస్‌తో ఇది మొదలైంది. ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్య సమస్యల చికిత్సకు సంబంధించి లోతైన థెరపీ సెషన్ల ప్రభావశీలతను ప్రపంచవ్యాప్తంగా టీవీ ప్రేక్షకులకు పరిచయం చేసింది. మరోవిధంగా చెప్పాలంటే సిగ్మండ్ ఫ్రాయిడ్‌ను వారి ఇళ్లకు చేరవేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో, "ఫ్రాయిడ్‌గ్రామ్" ప్రొఫైల్స్ అంతఃచేతన (బఅషీఅంఎఱశీబం ఎఱఅం) గురించి, అందులో దాగిన కోరికల గురించి కోట్లాదిమంది ఫాలోవర్లతో పంచుకుంటున్నాయి. సైకో ఎనాలసిస్‌లో భాగంగా, సోఫాపై పడుకుని బాల్య జ్ఞాపకాల గురించి మాట్లాడటాన్ని ఒకప్పుడు జోక్‌గా భావించారు. అదే ఇప్పుడు మళ్లీ సీరియస్ విషయంగా మారింది. కానీ ఇది కేవలం ఇంటర్నెట్ ట్రెండ్ మాత్రమే కాదు. ఇది ఒక లోతైన మార్పును ప్రతిబింబిస్తుంది. ఈ మార్పునకు బలమైన కారణాలే ఉన్నాయి. 20వ శతాబ్దపు చివరలో, ముఖ్యంగా ఇంగ్లిష్ మాట్లాడే దేశాలలో, సైకోథెరపీ దిశ మారింది. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (జదీ) ప్రాధాన్యం సంతరించుకుంది. దానిలో 'సరైనవి కాని' ఆలోచనా విధానాలను సరిదిద్దడంపైనే దృష్టి సారించారు. అదే సమయంలో, మానసిక ఆరోగ్య చికిత్సలో మందులు ప్రధానమయ్యాయి. నిరాశ, ఆందోళనలను మెదడులోని రసాయన అసమతుల్యతగా అభివర్ణించారు. ఒక టాబ్లెట్ వేసుకోవడం అనే పరిష్కారం సులువుగా అనిపించింది. భావోద్వేగాలను నియంత్రించే మూడ్ డిజైనర్ మందు ప్రొజాక్ (మనదేశంలో ఫ్లుడాక్) రోజువారీ వాడే ఉత్పత్తుల్లో ఒకటిగా మారింది. మనస్సు కుంగుబాటుకు చికిత్సగా యాంటీడిప్రెసెంట్ మందుల వాడకం విపరీతంగా పెరిగింది. మన దేశంలో దాదాపు 5శాతం వయోజనులు ఈ మందులపై ఆధారపడుతున్నారు. అయినప్పటికీ ఆందోళన,



ఒంటరితనం, నిరాశ పెరుగుతూనే ఉన్నాయి. చాలా మందికి లక్షణాల నుంచి ఉపశమనం లభించినా, శాశ్వతమైన మానసిక ప్రశాంతత మాత్రం దక్కటం లేదు. ఈ పరిస్థితే ఫ్రాయిడ్ ప్రధాన ఆలోచనను మళ్లీ తెరపైకి తెచ్చింది: మన మానసిక జీవితంలో చాలా భాగం మనకు తెలియకుండానే అంతఃచేతన (ఖఅషీఅంఎఱశీబం)లో జరుగుతుంది. ఫ్రాయిడ్ ప్రకారం, దానిలో దాగి ఉన్న సంఘర్షణలు, భయాలు, కోరికలు మన ప్రవర్తనను మలుస్తాయి. మనం వాటిని విస్మరిస్తే, అవి మాయమైపోవు. పైగా అవి ఆందోళన, కోపం లేదా పదేపదే మనల్ని మనం దెబ్బతీసుకునే ప్రవర్తనల రూపంలో బయటకు వస్తాయి. దక్షిణాఫ్రికాకు చెందిన న్యూరో సైకాలజిస్ట్ మార్క్ సోమ్స్ ఇటీవల ఫ్రాయిడ్‌పై పెరుగుతున్న ఆసక్తికి బలమైన శాస్త్రీయ గొంతుకగా నిలిచారు. ఆయన పుస్తకం 'ది హిడెన్ స్ప్రింగ్స్ ఎ జర్నీ టు ద సోర్స్ ఆఫ్ కాన్షియస్'లో ఆధునిక మెదడు పరిశోధనను సైకో ఎనలిటికల్ ఆలోచనలతో ముడిపెట్టారు. కలలు, భావోద్వేగాలపై సోమ్స్ చేసిన అధ్యయనాలు, మానసిక జీవితంలో అంతఃచేతన స్థాయి ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయని సూచిస్తున్నాయి. మందులు లక్షణాలను తగ్గించగలవని, కానీ వాటి వెనుక ఉన్న భావోద్వేగ చోదకశక్తులను పూర్తిగా పరిష్కరించలేవని ఆయన వాదిస్తున్నారు. నిజమైన మానసిక స్వస్థత పొందడానికి అంతఃచేతనలో దాగిన భావాలను స్పృహ (చేతన)లోకి తీసుకురావాలని సోమ్స్ అంటారు.

నిజానికి ఇంగ్లిష్ మాట్లాడే దేశాల వెలుపల ఫ్రాయిడ్ ఎప్పుడూ పూర్తిగా మరుగునపడలేదు. కొన్ని దేశాలలో మనోవైద్యం ఇప్పటికీ సైకో ఎనాలసిస్‌కు కట్టుబడి ఉన్నది. దీనికి స్పష్టమైన ఉదాహరణ బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా). ప్రపంచంలోనే అత్యధికంగా ప్రతి లక్ష మందికి 222 మంది మనస్తత్వవేత్తలు ఇక్కడ ఉన్నారు. అక్కడ థెరపీ అనేది దాచుకోవాల్సిన విషయమో లేదా అవమానకరమో కాదు; అది చాలా సాధారణం. ఆ దేశం కఠినమైన కాలంలో కొనసాగిన సమయంలో ఈ సంప్రదాయం బలపడింది. 19761983 మధ్య అర్జెంటీనా మిలిటరీ నియంతృత్వంలో ఉన్నప్పుడు సుమారు ముప్పైవేల మంది 'అదృశ్యం' అయ్యారు. కుటుంబాలు భయంలో నిశ్శబ్దంలో ఉండిపోయాయి. అటువంటి వాతావరణంలో సైకో ఎనాలసిస్ ప్రజలకు ఒక అరుదైన అవకాశాన్ని ఇచ్చింది, బహిరంగంగా మాట్లాడటానికి ఒక వ్యక్తిగత స్థలాన్ని ఇచ్చింది. బాధ గురించి మాట్లాడటం ఒక ప్రతిఘటన ప్రకటనగా, అవకాశంగా మారింది. సమాజం అణచివేయాలని చూసినా సత్యాన్ని వ్యక్తీకరించాలనే ఆలోచన థెరపీకి ఒక రాజకీయ కోణాన్ని ఇచ్చింది.

మరోవైపు ఆధునిక సమస్యలకు మనోవిశ్లేషణ ప్రభావశీలమైన పాత పరిష్కారంగా ముందుకు వస్తోంది. ఇప్పుడు ఆలోచనాపరులు ఆధునిక సమస్యలను పరిశీలించడానికి సైకో ఎనాలసిస్‌ను ఉపయోగిస్తున్నారు. ఫ్రాయిడ్ ఇప్పుడు ఎందుకు సందర్భోచితంగా అనిపిస్తున్నారని చూస్తే రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి మొదటిది వేగం జం సహనం. మనం వేగాన్ని ఆరాధించే యుగంలో ఉన్నాం. కానీ సైకో ఎనాలసిస్ దీనికి విరుద్ధం. ఇది నెమ్మదిగా సాగుతుంది, ఏళ్ల తరబడి టైమ్ పట్టవచ్చు. ఇది బాల్యం, కోరిక, అపరాధ భావం, భయం గురించి అసౌకర్యంగా అనిపించే ప్రశ్నలను అడుగుతుంది. శాశ్వత మార్పునకు ఓపిక, నిజాయితీ అవసరమని ఇది నమ్ముతుంది. రెండోది అణచివేత. ఫ్రాయిడ్ చెప్పిన 'అణచివేత' (=వజూతీవంంఱశీఅ) అనే అంశం వ్యక్తులకే కాదు, సమాజాలకు కూడా వర్తిస్తుంది. విస్మరించబడిన గాయాలు, నిరాకరించబడిన చరిత్ర, అణచివేసిన సంఘర్షణలు ప్రమాదకరమైన రీతిలో మళ్లీ బయటపడతాయి. సిగ్మండ్ ఫ్రాయిడ్ పరిపూర్ణంగా ఆమోదం పొందినవాడు ఏమీ కాదు. ఆయన ఆలోచనలు చాలా వరకు వివాదాస్పదంగానే ఉన్నాయి. అయినప్పటికీ, 'మన మనస్సు గురించి మనకే పూర్తిగా తెలియదు' అనే ఆయన ప్రధాన వాదన నేటికీ నిజమనిపిస్తోంది. ఇవాళ సోఫాలో కూర్చుని సైకో థెరపీ తీసుకోవటం అనేది ధనవంతుల విలాసం కాదు. గందరగోళంగా ఉన్న ఈ కాలంలో సాంత్వన పొంది జీవించడానికి అది ఒక సాధనంగా మారుతోంది. విధ్వంసం విస్తరిస్తున్న నేటి ప్రపంచంలో లోతైన ఆత్మపరిశీలన, భావోద్వేగపరమైన వాస్తవం చాలా అవసరమని ఎక్కువమంది గుర్తిస్తున్నారు. మనసును తొలిచివేస్తున్న భావాలను, వేదనలను ఎటువంటి అభిప్రాయాలు ఏర్పరచుకోకుండా వినగలవారు అందుబాటులో ఉన్నారన్న విశ్వాసాన్ని మించి ఉపశమనం ఇవ్వగల అంశం ఈ శతాబ్దంలో ఇంకేదీ లేదు.

## సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత
## నేడు వేకువ జామున తిరిగి దర్శనాలు

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చందగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చందగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసు కున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు. సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా తెలంగాణలోని పలు ప్రముఖ ఆలయాలను తాత్కాలికంగా మూసేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసేశారు. తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. నిర్మల్ జిల్లా బాసర ఆలయాన్ని కూడా మూసివేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఉదయం 6.15 నుంచి సాయంత్రం 7.15 వరకు మూసివేసారు. అనంతరం పుణ్యాహవాచనం, సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతిస్తారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలు కూడా మూసివేసారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరిచి శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం నిత్యపూజల తర్వాత దర్శనాలు ప్రారంభిస్తారు. ఓదెల మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని గ్రహణం కారణంగా మూసి వేసారు. ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల అనంతరం భక్తులకు అనుమతి ఇస్తారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7.30 వరకు మూసివేసారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తులు ఆలయ సమయాలను గమనించి దర్శనానికి రావాలని అధికారులు సూచిస్తున్నారు.

## తెలంగాన హైకోర్టుకు బాంబు బెదిరింపు
## వారంలో ఇది రెండోసారి

తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్‌ఎఫ్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఈ -మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

## యుద్ధవేళ..ఇరాన్‌లో భూకంపం

ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడులతో హడలెత్తిస్తున్న వేళ ఇరాన్‌ను భూకంపం కూడా వణికిస్తోంది. ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో కాసేపటి క్రితం 4.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. గెరాష్ సమీప ప్రాంతంలో భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు గుర్తించారు. ఈ భూకంపం వల్ల జరిగిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం గురించి వివరాలు బయటకు రాలేదు. కాగా, మరోవైపు ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న కెర్మాన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో కనీసం 13 మంది ఇరాన్ సైనికులు మరణించారని స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులు చేస్తోంది.

## స్థిరంగా బంగారం ధరలు

అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి. యుద్ధం కారణంగా మరింత భారీగా పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. మార్చి 3న మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,70,500 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,290 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,70,650కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,56,440కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్‌ను దాటేసింది.

## మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు
## ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

## కుటుంబ కలహాలు
## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కెసీఆర్ హోలీ శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో హోలీ కొత్త ఆశలు, విశ్వాసాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరి నడుమ ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండుగగా, హోలీ పండుగ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్నది అని కేసీఆర్ అన్నారు. ఆకులు రాలే శిశిరం నుంచి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ, ప్రకృతిలో నూతనత్వానికి సూచకంగా హోలీ నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఆశలు అడుగంటి ఉన్న తెలంగాణ ప్రజల్లో, కొత్త ఆశలు విశ్వాసాలు

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1
EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com